సాక్షి 24|7
వైఎస్ఆర్ జిల్లా
శనివారం 19-8-2017



8,9లో

మేల్కొంటేనే ఊపిరి



2,9లో

గోరఖ్‌పూర్ లాంటి ఘోరం జరగకమునుపే వైద్యారోగ్యశాఖ మేలుకోవాలి. అన్ని ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయా.. లేదా? ఉన్నచోట సక్రమంగా పనిచేస్తున్నాయా అనేది పరిశీలించాల్సి ఉంది. ఒక ప్రమాదం జరిగిన తర్వాత అప్రమత్తమయ్యే కంటే ఒక్కసారి అవలోకనం చేసుకుంటేనే మంచిది. ఏళ్ల నాటి క్రితం సిలిండర్లు... ఎంతమాత్రం పనిచేస్తున్నాయన్నది కూడా అనుమానాలకు తావిస్తోంది. అవసరమైనపుడే బయటికి తీయడం, అప్పుడు పనిచేయకపోతే ఆందోళన చెందే పరిస్థితి కంటే ముందే పరిశీలిస్తేనే బాగుంటుందని జనం కోరుతున్నారు.

- ఏదైనా అత్యవసరం జరిగితే అంతే సంగతులు
- గతంలోనూ రిమ్స్‌లో ఆక్సిజన్ వ్యవహారంపై రచ్చ
- కొన్ని పీహెచ్‌సీల్లోనే కనిపిస్తున్న ఆక్సిజన్ సిలిండర్లు
- ప్రస్తుత పరిస్థితుల్లో అన్నిచోట్ల ఉంటేనే ఉపయోగం
- గోరఖ్‌పూర్‌లాంటి ఘోరం జరగకముందే జాగ్రత్తలు అవసరం

75 జిల్లాలో పీహెచ్‌సీలు	35 ఆక్సిజన్ సిలిండర్లు ఉన్న పీహెచ్‌సీలు	14 24 గంటలు పనిచేసే ఆస్పత్రులు	01 100 పడకల ఆస్పత్రి
09 30 పడకల ఆస్పత్రులు	03 50 పడకల ఆస్పత్రులు	02 జిల్లాలో ప్రధాన ఆస్పత్రులు	రూ. 800 సిలిండర్‌కు అయ్యే ఖర్చు

నిర్లక్ష్యంపై కలత చెంది..

- హెచ్ఐవీ సిరంజితో సూపరింటెండ్‌పై వైద్యుడు దాడి
- ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో కలకలం
- వైద్యులు, సిబ్బంది విధుల బహిష్కరణ
- ఉన్నతాధికారులకు నివేదిక పంపిన డీసీహెచ్ఎస్



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ జయరాజన్

ప్రొద్దుటూరు క్రైం: ఒక్కటి కాదు.. రెండు కాదు.. రోజు ఆస్పత్రిలో ఘోరాలు జరుగుతున్నాయి. ఇంత పెద్దాసుపత్రి, వందల్లో ఉద్యోగులు.. అయినా ఏం ప్రయోజనం. ఆస్పత్రికి వచ్చిన రోగులను భయపెట్టి మరో ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఆస్పత్రిలో నిత్యం జరుగుతున్న నిర్లక్ష్యంపై కలత చెందిన డేవిడ్‌రాజ్ అనే వైద్యుడు హెచ్ఐవీ సిరంజితో మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌పై శుక్రవారం దాడి చేశాడు. ఈ ఘటన ప్రొద్దుటూరులో కలకలం సృష్టించింది. ఆస్పత్రి వర్గాల కథనం మేరకు.. నంద్యాలకు చెందిన డేవిడ్‌రాజ్ జిల్లా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కొన్ని నెలల గుండెకు బైపాస్ సర్జరీ

- మిగతా 10లో▶

‘కలకలం’పై కదలిక..!

- పత్రాల పునఃపరిశీలనకు ఆదేశాలు
- 31వ తేదీలోపు ప్రైవేట్ కళాశాలలు ఈసీ సమర్పించాలి



వైవీయూ సీడీసీ కార్యాలయం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాల్లో ఒక అంకానికి సంబంధించి కదలిక ప్రారంభమైంది. ‘అఫిలియేషన్ ప్రక్రియలో ఫోర్జరీల కలకలం’ పేరుతో ఈనెల 9న సాక్షిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. కొన్ని కళాశాలలు నకిలీ ధ్రువపత్రాలు, ఫోర్జరీ ధ్రువపత్రాలతో గుర్తింపు పొందే యత్నం

- మిగతా 2లో▶

వైఎస్ఆర్ జిల్లా | శనివారం | ఆగస్టు | 19 | 2017 సాక్షి

మునయ్య కోన వద్ద గుర్తుతెలియని మృతదేహం?

ముద్దనూరు: ముద్దనూరు–జమ్మలమడుగు ఘాట్‌రోడ్డులో శ్రీమునయ్య కోన వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే మృతదేహం మునయ్య కోన వద్ద ఏ ప్రాంతంలో ఉన్నదీ స్పష్టంగా తెలియలేదు. చనిపోయిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియరాలేదు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం పోలీసులకు అందింది. మృతదేహం ఆచూకీ కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : హెలెన్‌కెల్లర్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ శిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దౌలత్ ఖాన్ తెలిపారు. డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరుటకు ఇంటర్ లేక తత్సమానమైన కోర్సులో ఓసీ, బీసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లు 45 శాతం మార్కులు వచ్చిఉండాలన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరుటకు బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీలో ఓసీ, బిసీలు 50 శాతం, ఎస్సీ, ఎస్సీ, పీహెచ్ 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కోర్సులో బీటెక్ చదివిన వారు కూడా చేరవచ్చన్నారు. అయితే బీటెక్‌లో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. చేరదలచిన వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు నిర్ణయించిన కోర్సు ఫీజు తీసుకుని ఈనెల 20లోపు నగర శివారులోని సెంట్రల్‌జైల్‌కు దగ్గరలో ఉన్న హెలెన్‌కెల్లర్ కళాశాలను సంప్రదించాలని ఆయన కోరారు.

స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు వంట గ్యాస్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వంట గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి విజయరాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,765 పాఠశాలలు, 1,673 అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమీపంలోని గ్యాస్ ఏజెన్సీల వద్దకెళ్లి కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. వారంలోపు ఈ కార్యక్రమం పూర్తి కావాలన్నారు. నాన్ డొమెస్టిక్ ఎగ్జెంప్షన్ కేటగిరి కింద ఈ కనెక్షన్లు ఇచ్చామన్నారు. జనరల్ కనెక్షన్‌కు చెల్లించేలా రూ.1,450 డిపాజిట్ ఉంటుందన్నారు. గ్యాస్ సిలిండర్ కాకుండా మొత్తం రూ.2,212 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టౌల ఏర్పాటుకు టెండర్లు పిలిచే యోచన ఉందన్నారు.

యాజమాన్యంతో ఎన్ఎంయూ చర్చలు విఫలం

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఆందోళనలతో యాజమాన్యం ఎన్ఎంయూ నాయకులను చర్చలకు పిలిపించారు. ఈ క్రమంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఎన్ఎంయూ కడప రీజనల్ కార్యదర్శి వెల్లడించారు. నిరవధిక నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

– డీఎస్పీ షేక్ మాసుంబాషా


మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ మాసుంబాషా

కడప అర్బన్ : రానున్న వినాయక చవితి, బక్రీద్ పండుగలను శాంతియుత వాతావరణంలోనూ జరుపుకోవాలని డీఎస్పీ షేక్ మాసుంబాషా అన్నారు. శుక్రవారం కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో ప్రధాన రహదారిలో ముస్లిం, హిందూ మత పెద్దలు, స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వినాయక చవితి, బక్రీద్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని, అసాంఘిక శక్తులు రూపంలో ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడే దిశగా ప్రవర్తిస్తున్నారని ఏదైనా సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, తాలూకా ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి, 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు జమాల్‌వలి పాల్గొన్నారు.

మేల్కొంటేనే ఊపిరి..!

సాక్షి, కడప :


రాజంపేట ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్న ఆక్సిజన్

రెండేళ్ల క్రితం జిల్లాలో ప్రధాన ఆస్పత్రిగా చెప్పుకునే రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో ఒకేరోజు ముగ్గురు, నలుగురు చనిపోయిన నేపథ్యంలో వెంటిలేటర్ సిస్టమ్ తోపాటు ఆక్సిజన్ల సిలిండర్లు పనిచేయక పోవడంతోనే ఘటన జరిగిందని రచ్చ జరిగింది. ప్రస్తుతం అలాంటి పెద్ద సంఘటనలు జిల్లాలో లేకపోవడం ఊపిరి పీల్చుకునే అంశం. జిల్లాకేంద్రమైన కడపలోని రిమ్స్‌తోపాటు ప్రొద్దుటూరు, పులివెందుల ఏరియా ఆస్పత్రుల్లో ఆక్సిజన్ల సిలిండర్లు సంపూర్ణంగానే ఉన్నాయి. కానీ చాలా పీహెచ్‌సీల్లో ప్రాణవాయువు అందుబాటులో లేదు. ఉన్నవాటిల్లోనూ వాటిని వాడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం కానీ, అత్యవసర కేసులు వస్తే వెంటనే రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు తప్పించి ప్రాథమికంగా కొద్దిసేపు ఆక్సిజన్ పెట్టి ప్రాథమిక చికిత్స చేస్తున్న దాఖలాలు తక్కువే.

అత్యవసరానికే ముందే అప్రమత్తత అవసరం

జిల్లాలో సుమారు 75 పీహెచ్‌సీల తోపాటు పలు 24 గంటలు పనిచేసే ఆస్పత్రులతోపాటు 30, 50, 100 పడకల ఆస్పత్రులు ఉన్నాయి. అయితే కేవలం వృద్ధులు, కొంతమంది చిన్నారుల పరిస్థితిని బట్టి ఆక్సిజన్ వినియోగిస్తున్నారు. దీంతో అవసరం కూడా తక్కువగానే ఉంది. కానీ ఏదైనా పెద్దప్రమాదం జరిగితే కష్టమే. ఇటీవలె గోరఖ్‌పూర్‌లోని మెడికల్ ఆస్పత్రిలో చిన్నారులు ఆక్సిజన్ అందక సుమారు 30మందికి పైగా మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్యాధికారులు ఎక్కడికక్కడ ఆస్పత్రుల నుంచి ఆక్సిజన్ సిలిండర్లకు సంబంధించిన వివరాలతోపాటు వెంటిలేటర్ల సిస్టమ్ గురించి నివేదికలు తెప్పించుకున్నారు. అయితే ఇప్పటివరకు పలు ఆస్పత్రుల్లో చిన్నారులకు సంబంధించిన ప్రత్యేక విభాగాలు ప్రారంభానికి నోచుకోలేదు.

ఆక్సిజన్ సమస్య లేదు

జిల్లాలో 24గంటలు పనిచేసే పీహెచ్‌సీలు దాదాపు 35 వరకు ఉన్నాయి. ఇక్కడ అన్నిచోట్ల ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం! అంతే కాకుండా గర్భిణులు, చిన్నపిల్లలు అధికంగా వచ్చే పీహెచ్‌సీలను కూడా గుర్తించి అక్కడ కూడా ఆక్సిజన్ సిలిండర్లు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఆక్సిజన్ సిలిండర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఇప్పటికే అందరినీ అప్రమత్తం చేశాం!

– డాక్టర్ రామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

కొన్ని పీహెచ్‌సీలకే పరిమితం

జిల్లాలో 75 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నా 35చోట్లనే ఆక్సిజన్ సిలిండర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాకాకుండా అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ ఉండడం చాలా అవసరం. ఎందుకంటే ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నం అవుతాయో కూడా తెలియని పరిస్థితి. పెద్దాస్పత్రులను పక్కన పెడితే మారుమూల పల్లెల నుంచి ఎక్కువగా పీహెచ్‌సీలకు రోగులు వెళుతుంటారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కువగా చిన్నారులు, ఆస్తమా రోగులు వస్తుంటారు. వాటన్నింటిని పరిగణలోకి తీసుకుని అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు నేరుగా పీహెచ్‌సీలకు వెళతారు. ఎమర్జెన్సీని దృష్టిలో పెట్టుకుని అప్పటికప్పుడు అత్యవసరంగా అక్కడనే ఆక్సిజన్ పెట్టడానికి అవకాశం ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అంతంత మాత్రమే

జిల్లాలోని అన్ని ప్రధాన ఆస్పత్రుల తోపాటు పలు పీహెచ్‌సీల్లో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ సిలిండర్లలో కొన్ని అంతంతమాత్రంగానే పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది పీహెచ్‌సీ సిబ్బంది చూసుకోకపోతే సిలిండర్ ఖాళీ అయినా అలాగే ఉండిపోతుంది. అదేవిధంగా కొన్ని లీకై ఆక్సిజన్ బయటికి వెళ్లినా పట్టించుకోని పరిస్థితి. ఆక్సిజన్ సిలిండర్లు అయిపోయిన వెంటనే ఆస్పత్రి అభివృద్ధి నిధులతో మళ్లీ సిలిండర్‌కు ఆక్సిజన్ పట్టుకోవాలి. అందుకుగాను రూ.600–800 మధ్య మాత్రమే ఖర్చవుతుంది.

‘కలకలం’పై కదలిక..!

▶ మొదటిపేజీ తరువాయి

చేసిన విషయం వెలుగుచూడడంతో దీనిపై విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. దీనికి స్పందించిన రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశిస్తామని పేర్కొన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం విశ్వవిద్యాలయ అధికారులు దీనిపై కార్యచరణ ప్రారంభించారు. అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అనుబంధ కళాశాలలు తమ కళాశాలలకు చెందిన భూమి, భవనాలకు సంబంధించిన పత్రాలను పునఃపరిశీలన చేయించుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

31లోపు పునఃపరిశీలన చేసుకోవాలి: రిజిస్ట్రార్

వైవీయూ అనుబంధ కళాశాలలకు సంబంధించిన ప్రిన్సిపల్ లేదా కార్యదర్శి తమ కళాశాలలకు చెందిన భూమి, భవనం కట్టిన స్థలానికి ఒరిజినల్ ఈసీని మీసేవ ద్వారా పొంది ఆగస్టు 31తేదీలోపు వైవీయూ కళాశాల అభివృద్ధి మండలి (సీడీసీ) కార్యాలయంలో సమర్పించాలని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య కె. చంద్రయ్య శుక్రవారం తెలిపారు. అదే విధంగా కళాశాల చెల్లించాల్సిన రూ. 2లక్షల కార్పస్‌ఫండ్ కళాశాల కార్యదర్శి, వైవీయూ రిజిస్ట్రార్ పేరిట తెరిచిన జాయింట్ బ్యాంక్ అకౌంట్‌లో ఉండాలని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ /కార్యదర్శి కార్పస్‌ఫండ్‌కు సంబంధించిన ఒరిజినల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సంబంధింత బ్యాంక్ మేనేజర్ ద్వారా ధ్రువీకరణ చేయించుకుని ఆగస్టు 31వ తేదీలోపు సీడీసీ కార్యాలయానికి పంపించాలని తెలిపారు. పైన తెలిపిన విధంగా నిర్ణీత గడువులోపు పూర్తి చేయకపోతే విశ్వవిద్యాలయం వారిపై తదుపరి చర్యలు చేపడుతుందని తెలిపారు. కళాశాలలకు సంబంధించిన అఫిలియేషన్ కమిటీ ఇచ్చిన నివేదిక, భూమి, భవనం కట్టిన స్థలం డాక్యుమెంట్లు, ధ్రువీకరణ ఆధారంగానే కళాశాలలకు అఫిలియేషన్ జారీచేస్తామని ఆయన స్పష్టం చేశారు. సీడీసీ డీన్ ఆచార్య ఏజీ దాము మాట్లాడుతూ భూమి, భవనం కట్టిన స్థలం డాక్యుమెంట్లు, కార్పస్‌ఫండ్‌కు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను సంబంధిత అధికారులచే ధ్రువీకరణ చేసుకుని ఆగస్టు 31వ తేదీలోపు సీడీసీ కార్యాలయానికి పంపాలని కోరారు. వైవీయూ పరిధిలో 2017–18 విద్యాసంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న కళాశాలలకు ఈ విషయమై లేఖలు పంపినట్లు ఆయన తెలిపారు.



వైవీయూ పరిపాలన భవనం

నాలుగు నెలల కిందట మృతి..ఇప్పుడు మృతదేహం రాక


కుటుంబసభ్యులతో మృతుడు జలీఫ్


జలీఫ్ మృతదేహం

టి.వెలమవారిపల్లె (వేంపల్లె): ఇదేంటి చనిపోయి నాలుగు నెలలైతే మృతదేహం ఇప్పుడు ఇంటికి వచ్చిందని ఆశ్చర్యపోతున్నారా ఇది వాస్తవం. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి చనిపోతే చాలామందికి ఇదే పరిస్థితులు ఎదురవుతున్నాయి. పేద కుటుంబాలు తమ ఇంటి యజమాని అక్కడ చనిపోతే కడసారిచూపు కోసం ఇన్నాళ్లు నిరీక్షించే పరిస్థితులు ఉన్నాయంటే మన విదేశాంగ వ్యవస్థ ఏమేరకు పనిచేస్తోందో అర్థమవుతోంది. వివరాల్లోకి వెళ్తే వేంపల్లె మండలం టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన పడిగపల్లె జలీఫ్(35) కువైట్‌లో ఓ సేఠ్ దగ్గర పనిచేస్తుండేవాడు. ఆ సేఠ్ బంధువులు సౌదీలో ఉండగా జలీఫ్‌ను అక్కడికి పంపాడు. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీన అక్కడ జలీఫ్ మృతి చెందారు. ఈ విషయాన్ని అక్కడున్న వారి బంధువులు భార్య కుళ్లాయమ్మకు చేరవేశారు. కాగా వారి బంధువులు అక్కడి సేఠ్ జలీఫ్‌ను హింసించి చంపారని అప్పట్లో ఆరోపించారు. కాని మృతదేహం నెలలోపు ఇంటికి చేరుతుందని, కడసారి చూపు కోసం బంధువులు నిరీక్షించారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. చివరకు లాభం లేదనుకొని మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు జలీఫ్ సోదరుడు ఇదయతుల్లా నెల కిందట సౌదీకి వెళ్లి అక్కడ పోలీసు కేసు నమోదు చేయించి మృతదేహన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి భార్య కుళ్లాయమ్మ కుమార్తె, కుమారుడు బంధువుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరికీ సాధ్యం కాలేదు.

ఎనిమిది మందిపై కేసు నమోదు

సిద్దవటం : మండలంలోని చెలమారెడ్డి కొట్టాలలో జరిగిన ఘర్షణ కేసులో పోతురాజు రత్న వర్గానికి చెందిన నలుగురిపై, పోలా రాము వర్గానికి చెందిన నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. చెలమారెడ్డి కొట్టాల గ్రామానికి చెందిన పోతురాజు రత్న ఈమె ఆడబిడ్డ లక్ష్మీదేవి గురువారం బహిర్భూమికి వెళుతుంటే మార్గమధ్యలో ఇంటి ముందర వెళుతున్న వీరిని పోలా రాము అసభ్యకరంగా మాట్లాడారని, రత్న ఇంటికి వచ్చి భర్త శివకు చెప్పింది. దీంతో శివ రాము ఇంటి వద్దకు వెళ్లి ఎందుకు మా వారిని తిట్టావురా.. అని అడుగుతుండగా రాముతో పాటు గంగాధర్, సుబ్బమ్మ, సుబ్బలక్షుమ్మలు ఏమిరా.. ఎక్కువ మాట్లాడుతున్నావని వాదనకు దిగారు. దీంతో శివ ఆయన భార్య రత్నా, లక్షీదేవి, సుబ్బరాయుడులు అక్కడికి రావడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రెండు వర్గాల వారికి చిన్న చిన్న గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు కేసులు పెట్టుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


గాయపడిన స్కూటరిస్టు అశోక్

ఇసుకపల్లె క్రాస్(రాజంపేట) : కడప–రేణిగుంట జాతీయరహదారిలో బోయనపల్లె సమీపంలోని ఇసుకపల్లె క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు కంభగారి అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పులపుత్తూరుకు చెందిన అశోక్ స్కూటర్‌పై వెళుతుండగా తమిళనాడుకు చెందిన లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా నడిపిన కారణంతో ప్రమాదానికి గురైనట్లు రాజంపేట రూరల్ ఎస్ఐ మహేశ్‌నాయుడు తెలిపారు. తీవ్రంగా గాయపడిన స్కూటరిస్టును మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న అల్యూమినియం తీగలు

జమ్మలమడుగురూరల్ : బ్రహ్మణి స్టీల్ కర్మాగారంలో ఉన్న విద్యుత్ తీగలు దొంగలించబడ్డ సంఘటనలో చోరికి పాల్పడిన ఇద్దరిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అర్బన్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మణి కర్మాగారం నుంచి 32 కేవీకి సంబంధించి విద్యుత్ తీగలు చోరీకి గురి అయ్యాయని కర్మాగారానికి చెందిన ప్రతినిధులు ఈ నెల 5వ తేదీన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం చిట్టిమిటి చింతల వద్ద చోరీకి పాల్పడినవారు ఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బంది దాడి చేసి మూడే చంద్రనాయక్, మూడే మాతృనాయక్, సోనేనాయక్ లను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి 510 కేజీల అల్యూమినియం తీగలు, 41,500 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐలు ప్రవీణ్‌కుమార్ ,ఉమామహేశ్వరరెడ్డి ఎస్ఐ హనుమంతు , పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధీనంలో గుర్తు తెలియని బాలుడు


పోలీసు స్టేషన్‌లో ఉన్న గుర్తు తెలియని బాలుడు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలోని పోలీసుల ఆధీనంలో గుర్తు తెలియని నాలుగేళ్ల బాలుడు ఉన్నాడు. ఈ విషయమై ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస సినిమా హాలు వద్ద ఆ బాలుడు తిరుగుతూ ఉంటే ఓ వ్యక్తి తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారన్నారు. ఈ బాలుడు ఎవరో తెలిస్తే తమను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ప్రమాదం మిగిల్చిన విషాదం

- మృతుల్లో ఒకరు ఎంబీఏ విద్యార్థి
- బోరున విలపించిన సహచర విద్యార్థులు
- మూడు కుటుంబాల్లో ఆవేదనను మిగిల్చిన రోడ్డు ప్రమాదం
- కారులోని వారు పరారీ



శ్యాంబాబు మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు (ఇన్‌సెట్) విలపిస్తున్న మహేష్ స్నేహితులు

కడప అర్బన్ :

కమలాపురం మండలం చదిపిరాళ్ల వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న నలుగురు యువకులను, కళాశాల బస్సును తప్పించబోయిన కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్నేహితులు మృతి చెందారు. మరో యువకుడు ప్రస్తుతం రాయవేలూరుతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో మృత్యువాత పడిన వారంతా స్నేహితులే. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

- మృతుల్లో కడప రామరాజు పల్లెకు చెందిన పాగాల శ్యాంబాబు (23) ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. కడపలో ఐటీఐ సర్కిల్ సమీపంలో నివసిస్తున్న నాగూరి శివారెడ్డి (22)తో కలిసి మోటార్ బైకులో శ్యాంబాబుతో పాటు వెళ్లి ప్రమాదంలో మృతి చెందాడు.


శివారెడ్డి మృతదేహం వద్ద విషాదంలో బంధువులు, మహేష్ మృతదేహం వద్ద సోదరుడు

- కడప నగరం అంభాభవానీ నగర్‌కు చెందిన మహేష్ (22) తిరుపతి ఎంఎం కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు హరిబాబుతో కలిసి, పై ఇరువురితో పాటు స్నేహితుని వివాహానికి వెళతుండగా ఈ ప్రమాదం జరిగింది. మహేష్ మృతి చెందాడు. హరిబాబును 108లో రిమ్స్‌కు తర్వాత రాయవేలూరుకు తరలించారు. మహేష్ మృతి చెందాడనీ తెలియగానే తిరుపతి నుంచి తోటి విద్యార్థులు రిమ్స్ మార్చురీకి చేరుకున్నారు. బోరున విలపించారు. మహేష్ సోదరుడు హరిశ్చంద్ర ప్రసాద్ తన ఆవేదనను మృతదేహాన్ని స్పృశిస్తూ తెలియజేశాడు.
- కమలాపురం ఎస్ఐ రఫీ రిమ్స్ మార్చురీకి తమ సిబ్బందితో చేరుకుని కేసు నమోదు చేయగా, రిమ్స్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. రిమ్స్ మార్చురీ వద్ద ముగ్గురి బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

రూ. 45 లక్షల మేర ఆస్తి నష్టం


కాలిపోయిన వస్తువులు

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని బీవీఎస్ థియేటర్ పక్కన ఉన్న శ్రీ వెంకటేశ్వర ఫర్నీచర్స్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు గాండ్ల నారాయణస్వామి శివాలయం వీధిలో ఫర్నీచర్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ఉన్నట్టుండి షాపులో నుంచి పొగ రావడంతో స్థానికులు దుకాణ యజమానులకు సమాచారం అందించారు. విషయం తెలియడంతో అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపులో మంటలు ఎక్కువగా ఉండటంతో కొంత సేపు షెట్టర్లు తెరవడానికి అగ్నిమాపక సిబ్బందికి సాధ్య పడలేదు. తర్వాత షెట్టర్‌లను తెరచి మంటలను అదుపు చేశారు. ఫర్నీచర్ షాపులో ఉన్న బీరువాలు, మంచాలు, కుర్చీలు, ఉడ్ ఫర్నీచర్ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.45 లక్షలు పైగా నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమానులు చెబుతున్నారు.

బంగారు నగలు పోగొట్టుకున్న మహిళ

కడప అర్బన్ : కడప నగరంలోని బిల్టప్ సమీపంలో ఓ మహిళ ఆటోఎక్కి టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆటోలోనే ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును మరిచిపోయింది. ఆటో తాను దిగగానే తన దారిన వెళ్లిపోయింది. ఈ సంఘటనలో బంగారు నగలు పోగొట్టుకున్న బాధితురాలు కడప టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

శంకరాపురంలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం శంకరాపురంలో నివసిస్తున్న వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో శుక్రవారం చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు వాహనాన్ని బాడుగల కోసం తీసుకెళుతూ వెంకటేశ్వరరావు జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య మూడు రోజుల క్రితం కమలాపురంలో తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. ఊరి నుంచి శుక్రవారం తిరిగి వచ్చిన వెంకటేశ్వరరావు తన ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గుర్తిం చాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటిలోని రూ. 2 లక్షల నగదు, 65 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యా దు చేశారు. చిన్నచౌకు ఎస్ఐ యోగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- అదుపులో ముగ్గురు తమిళ కూలీలు
- పరారీలో మరికొందరు


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

సిద్దవటం: సిద్దవటం బీటు లోని ఉప్పు గుంతల అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున అటవీశాఖ సిబ్బంది తమిళ కూలీలపై దాడులు చేశారు. ముగ్గురు కూలీలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని డిప్యూటీ రేంజర్ పరుశురామ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిద్దవటం రేంజి పరిధిలోని సిద్దవటం బీటులో ఉప్పు గుంతల అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున బీటు అధికారి సుబ్రమణ్యం, రోళ్లబోడు అసిస్టెంటు బీటు అధికారి బీవీ సుబ్బయ్య, ప్రొటక్షన్ వాచర్‌లు అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కొందరు ఎర్రచందనం అక్రమాలకు పాలపడుతుండగా తమను చూసి పరారవుతుండటంతో తాము వెంటబడి ముగ్గురు తమిళ కూలీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ వారి వద్ద నుంచి 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరి కొందరు పరారైనట్లు తెలిపారు.

నిద్ర మాత్రలు మింగిన వ్యక్తి మృతి

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాలపడిన కుర్రాకు ప్రభాకర్(58) శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతూ మనస్థాపం చెందిన కుర్రాకు ప్రభాకర్ గురువారం ఉదయం ఇంట్లో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాలపడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు ప్రొద్దుటూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేసికుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవిష్యం



మేషం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఉద్యోగలాభం. కార్యసిద్ధి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగులకు నూతనోత్సాహం.

వృషభం: కొన్ని కార్యక్రమాలను వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబ సమస్యలు. అనారోగ్యం. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో కొద్దిపాటి గందరగోళం.

మిథునం: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యసిద్ధి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: పనుల్లో జాప్యం. ఆర్థిక లావాదేవీలలో నిరుత్సాహం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.

సింహం: కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. కుటుంబంలో శుభకార్యాలు. ఆకస్మిక ధనలాభం. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతి సూచనలు.

కన్య: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆలయాలు సందర్శిస్తారు. సంఘంలో ఆదరణ. వ్యవహారాలలో పురోగతి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల పరిస్థితి.

తుల: ఆదాయానికి మించిన ఖర్చులు. బంధువులతో విభేదాలు. శ్రమాధిక్యం. పనుల్లో అవాంతరాలు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

వృశ్చికం: ప్రయాణాలు రద్దు. ఆర్థిక ఇబ్బందులు. అనారోగ్యం. కుటుంబసమస్యలు. ఇంటాబయటా ఒత్తిడులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహం.

ధనుస్సు: నూతన పరిచయాలు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. దైవదర్శనాలు. విందు వినోదాలు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళం తొలగుతుంది.

మకరం: సోదరులు,సోదరీలతో సఖ్యత. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. చిన్ననాటి మిత్రుల కలయిక. కార్యసిద్ధి. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

కుంభం: పనుల్లో ఆటంకాలు. రాబడికి మించి ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువుల నుంచి ఒత్తిడులు. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి.

మీనం: ఎంతగా కష్టపడ్డా ఆశించిన ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు. ఆర్థిక లావాదేవీల్లో ఒడిదుడుకులు. సోదరులతో విభేదాలు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు.

– సింహంభట్ల సుబ్బారావు

22 నుంచి ఏపీ ఎంసెట్ ఫైనల్ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్ :

ఏపీ ఎంసెట్–2017 ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన బైపీసీ విద్యార్థులు బీ ఫార్మసీ, ఫార్మా డీ, బయో టెక్నాలజీలో చేరుటకు ఈ నెల 22, 23తేదీల్లో ఫైనల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్‌ను కడప నగర శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతరం తమ ఆప్షన్ల నమోదు కార్యక్రమాన్ని చేసుకోవలసి ఉంటుంది. వివరాలకు హెచ్‌టీటీపీ://ఏపీఎంసెట్‌బి.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూసుకోవచ్చు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ :

22, 23 తేదీల్లో 1 నుంచి చివరి ర్యాంకు వరకు ఉంటుంది.

రుసుం వివరాలు:

కోర్సుల్లో ప్రవేశం కోసం ఓసీ, బీసీ అభ్యర్థులకైతే రూ.1,200, ఎస్సీ, ఎస్టీలకు రూ.600 చెల్లించవలసి ఉంటుంది. ఈ ప్రవేశ రుసుంను విద్యార్థులు హెచ్‌టీటీపీ://ఏపీఎంసెట్‌బీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రాసెసింగ్ ఫీ పేమెంట్ ఆన్‌లైన్ లింక్ ద్వారా క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ఈనెల 21లోపు చెల్లించాల్సి ఉంది. రుసుం చెల్లించిన రసీదును పొందిన అభ్యర్థులే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో పాల్గొనవచ్చు.



ఎంసెట్ కౌన్సెలింగ్ నిర్వహించు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

సర్టిఫికెట్ల వివరాలు:

కౌన్సెలింగ్‌లో పాల్గొనే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు ఎంసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ మార్క్స్ మెమో, ఇంటర్ మార్క్స్ మెమో, ఆధార్, స్టడీ (6వ తరగతి నుంచి ఇంటర్ వరకు) ఇన్‌కమ్, రెసిడెన్సీ, క్యాస్ట్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్లు జిరాక్సు కాపీలతో తమకు కేటాయించిన తేదీల్లో హాజరు కావాల్సి ఉంటుంది.

ఆప్షన్ మార్చుకొనుటకు

ఏపీ ఎంసెట్– 2017 ఫేజ్–1 కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులు ఎవరైనా తమ ఆప్షన్ను మార్చుకొనువారు తమకు ముందు కేటాయించిన లాగిన్ ఐటీ, పాస్‌వర్డ్ ద్వారా 22, 23 తేదీల్లో మార్చుకోవచ్చు. వివరాలకు హెచ్‌టీటీపీ://ఏపీఎంసెట్‌బీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఎంసెట్ రెండవ విడత కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థుల కోసం నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు వారికి కేటాయించిన తేదీల్లో హాజరై సర్టిఫికెట్లను పరిశీలింపచుకోవాలి. అలాగే కళాశాలల ఎంపిక నమోదును కూడా చేసుకోవచ్చు.

– డాక్టర్ పీకే ప్రకాష్‌రెడ్డి, ఎంసెట్ కో–ఆర్డినేటర్, కడప

రేపు సాహితీ సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 20న సాయంత్రం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో సాహితీ సదస్సు నిర్వహిస్తున్నామని బ్రౌన్ గ్రంథాలయ బాధ్యులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ప్రముఖ కవి శ్రీధర తిరుపతయ్య జీవితం –సాహిత్యం అనే అంశంపై ప్రముఖ కవి, నాటక రచయిత పీ సుబ్బారాయుడు మాట్లాడనున్నట్లు తెలిపారు.

రేపు భాషోపాధ్యాయుల సమావేశం

కడప ఎడ్యుకేషన్: ఎల్‌పీ వ్యవస్థ రద్దు గురించి ఈనెల 20న ఆదివారం కడప డీసీఈబీ హాలులో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లా భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని, ఎస్ఎల్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్యను, ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డిని సన్మానించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని భాషోపాధ్యాయులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

రేపు మోకాలి నొప్పి–స్టెమ్ థెరపీపై అవగాహన

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో ఉన్న మయూరా గార్డెనియాలో ఆదివారం 'మోకాలి నొప్పి– స్టెమ్ థెరపీ'పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి నర్సింగ్ హోం మేనేజింగ్ డైరెక్టర్, కడప జిల్లా ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ సుబ్రమణ్య రావు తెలిపారు. స్థానిక శ్రీ సాయి నర్సింగ్ హోంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ కంటివైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్ మాధవి, ఫిజియోథెరపిస్ట్ డా. సీ శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రమణ్య రావు

22న మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మనోహర్ తెలిపారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కడుపు కొట్టేందుకు ప్రభుత్వం జీఓ 279ని తీసుకొచ్చిందన్నారు. దీన్ని రద్దు చేయాలని రెండేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీవీ సుబ్బమ్మ, జీసీ చెన్నయ్య, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

20న సైన్స్‌క్లబ్ సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో ఈనెల 20న ఆదివారం ఉదయం సీవీ రామన్ సైన్సు క్లబ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సైన్సు క్లబ్ నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు బయపురెడ్డి, వృక్షశాస్త్ర అధ్యాపకులు పీవీ కృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. వీరు పదవ తగరతికి సంబంధించి భౌతిక, జీవశాస్త్ర జెనెటిక్స్ పైన మాట్లాడతారని తెలిపారు. అలాగే జీవశాస్త్ర, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులందరూ తప్పక సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

20న జాబ్‌మేళా

కడప రూరల్ : ఈనెల 20న కడప నగరంలోని శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత 2014 నుంచి 2017 వరకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 26 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94457 19214 నంబరును సంప్రదించాలని కోరారు.

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాం.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం:

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు :

సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

వాతావరణం

రానున్న 24 గంటల్లో మహారాష్ట్ర, తెలంగాణ, పశ్చిమ తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కర్ణాటక, ఒడిశా ఛతీస్‌గఢ్, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చు. గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, హరియాణాల్లో పొడి వాతావరణం ఉంటుంది.

వైఎస్ఆర్ జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం
33.3°/24.5°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	37.8	29.0
కోల్‌కతా	31.8	29.0
బెంగళూరు	28.9	20.4
ముంబై	31.5	26.0
చెన్నై	34.1	22.2

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
చిత్తూరు	34.2/24.5	తాడేపల్లిగూడెం	29.4/24.7
తిరుపతి	34.2/24.5	విశాఖపట్నం	28.6/25.8
కడప	33.3/24.5	ఖమ్మం	28.1/19.6
నెల్లూరు	33.2/26.6	కాకినాడ	28.0/26.0
అనంతపురం	32.3/25.1	గుంటూరు	28.0/24.8
నల్లగొండ	31.2/25.6	మెదక్	27.8/21.8
ఒంగోలు	31.1/25.8	విజయవాడ	27.7/25.4
కర్నూలు	30.9/25.9	వరంగల్	27.6/24.5
మహబూబ్‌నగర్	29.7/24.5	ఆదిలాబాద్	27.0/22.6
శ్రీకాకుళం	29.5/25.5	కరీంనగర్	26.6/24.4
విజయనగరం	29.5/25.5	నిజామాబాద్	26.3/24.4
ఏలూరు	29.4/24.7	హైదరాబాద్	26.1/23.9
రాజమండ్రి	29.4/24.7	రంగారెడ్డి	26.1/23.9

బుల్లితెర

www.sakshi.com

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 ఈట్ అవుట్
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 సరదాగా కాసేపు
రా.08.30 బతుకు చిత్రం
రా.09.00 న్యూస్ 360
రా.09.30 జ్యాక్ బాక్స్
రా.10.30 మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్

ఉ.09.30 రాముడు భీముడు
మ.12.00 హరే రామ్
మ.03.00 సుబ్బు
సా.06.00 మురారి
రా.09.00 నేరస్థుడు



మూవీస్ నౌ

ఉ.07.00 అండర్ సీజ్ 2
ఉ.10.55 అండర్‌డాగ్
మ.02.45 మోడరన్ టైమ్స్
సా.04.30 ఫస్ట్ బ్లడ్
రా.09.00 శాన్ ఆండ్రియాస్



హెచ్‌బీవో

ఉ.06.00 టార్క్
మ.01.28 10,000 బి.సి.
మ.03.27 ఆర్మర్ ఆఫ్ గాడ్
రా.07.12 ద టక్సెడో
రా.09.00 ద అకౌంటెంట్




స్టార్ మూవీస్

ఉ.07.37 మెన్ ఇన్ బ్లాక్ 2
మ.12.18 ద అవెంజర్స్
మ.03.09 ఐరన్ మ్యాన్ 3
సా.05.51 కెప్టెన్ అమెరికా
రా.09.00 అవతార్



మా మూవీస్

ఉ.07.00 జ్యోతిలక్ష్మి
ఉ.09.00 ఆవారా
మ.12.00 ఎదురులేని మనిషి
మ.03.00 తూనీగ తూనీగ
సా.05.00 రఘువరన్ బీటెక్



జీ సినిమా

ఉ.08.03 ఘాతక్: ద డెస్ట్రాయర్
ఉ.09.55 యోధ నం.1
ఉ.10.59 చోరీ చోరీ చుప్‌కే చుప్‌కే
మ.02.30 మర్ద్
రా.11.30 డేరింగ్‌బాజ్ 2



మార్పునకు శ్రీకారం

- మట్కా బీటర్లు, ఆడేవారి వ్యసనాలు దూరం చేసేందుకు ప్రణాళిక
- ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన స్వల్ప వ్యవధిలోనే నిర్ణయం
- పరివర్తన కోసం ప్రత్యేక వ్యూహ రచన
- నేడు జెడ్పీలో పరివర్తనకు ముహూర్తం

సాక్షి, కడప/అర్బన్ :

ఎన్నో ఏళ్లుగా వేళ్లూనుకుపోయిన మట్కాను కూకటివేళ్లతో పెకలించేందుకు ఎస్పీ ప్రత్యేక వ్యూహ రచన చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మట్కా జరగకూడదు, నిర్వహించకూడదు అన్న సంకల్పంతో దాన్ని నివారించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. మట్కా తెలిసి ఆడినా, తెలియక ఆడినా తప్పు తప్పే అన్నట్లు....జన్మరీత్యా అందరూ మంచివారే అయినా అనుకోని పరిస్థితుల కారణంగా వ్యసనాలకు లోనై మట్కా బారిన పడిన వారిలో మార్పుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మట్కా ఆడుతున్న వారికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించడం, మట్కా వల్ల జరుగుతున్న నష్టంతోపాటు జీవిత గమ్యంలో ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ వారిలో మార్పుకోసం జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ పరివర్తన అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభ సమావేశం ద్వారా సంకేతాలు ఇవ్వనున్నారు.

మానసిక బలహీనతలతోనే వ్యసనాలకు బానిస

జులైలో ఎస్పీగా బాబూజీ అట్టాడ బాధ్యతలు చేపట్టాక ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పనలో భాగంగా ఆలోచన చేశారు. ముందుగా జిల్లాలో పరిస్థితులు...శాంతిభద్రతలు...ఫ్యాక్షన్...ముఠా కక్షలు...ఇతర అనేక అంశాలపై ప్రత్యేకంగా ఆలోచించారు. ప్రధానంగా సామాన్య కుటుంబాలతోపాటు కూలీ నాలీ చేసుకునే పేద కుటుంబాలు మట్కా బారిన పడి అప్పుల పాలవుతున్న వ్యవహారం ఆయన దృష్టికి వచ్చింది. ప్రత్యేకంగా మట్కాతో అప్పులపాలై ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న ఒక కుటుంబ వ్యథను ఎస్పీ బాబూజీ అట్టాడ విని చలించిపోయారు. తర్వాత ఆయన మట్కా ద్వారానే కుటుంబం చిన్నాభిన్నమై ఆత్మహత్యకు ప్రేరేపించిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ ప్రత్యేకంగా జిల్లాలో మట్కాను రూపుమాపాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా దాదాపు నెల రోజులుగా మట్కాపై కసరత్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మట్కాను చేతనైనంత మేరకు ఆడనివ్వకుండా చేయాలన్న సంకల్పంతో ఉన్నారు.

ప్రతి పల్లెకు పరివర్తన

జిల్లాలో శనివారం ప్రారంభం కానున్న పరివర్తన కార్యక్రమం ప్రతి పల్లెకు చేరనుంది. కళాశాలలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, పదిమంది కలిసే ప్రధాన కూడళ్లతోసహా పల్లె సీమల్లో సైతం పరివర్తనకు సంబంధించిన వ్యవహారంపై ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. మట్కా వల్ల జరిగే నష్టాలు, కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవడం, ఇతర అనేక అంశాలను క్రోడీకరిస్తూ అన్నిచోట్ల ప్రత్యేక కార్యక్రమాల ద్వారా పోలీసు బృందాలు ప్రచారం చేయనున్నాయి. అంతేకాకుండా ఒకవేళ పోలీసుశాఖ మట్కాపై ఉక్కుపాదం మోపుతున్నా నిబంధనలు అతిక్రమించి మట్కా నిర్వహించే వారిని ఏం చేయాలన్న దానిపై కూడా ప్రత్యేక ఆలోచన చేస్తున్నారు. ఏది ఏమైనా ఎస్పీ మట్కా నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు.

కల్లూరు మహేశ్వరమ్మకు డాక్టరేట్



మహేశ్వరమ్మ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆంగ్లభాషా పరిశోధక విద్యార్థిని కల్లూరి మహేశ్వరమ్మకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్యులు డాక్టర్ పి. పద్మ పర్యవేక్షణలో 'రేస్, క్లాస్ అండ్ జెండర్ ఇన్ గ్లోరియ నెయిలర్స్ సెలెక్ట్ ఫిక్షనల్ వర్క్స్' అన్న అంశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

నేడు ఫొటోగ్రఫీ దినోత్సవ సదస్సు

కడప కల్చరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు నగర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి నిత్య ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు కలెక్టర్ బాబూరావునాయుడు, ఎస్పీ బాబూజీ అట్టాడ, న్యాయవాది వీణా అజయ్‌కుమార్ అతిథులుగా హాజరు కానున్నారన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల జీతాల పెంపుపై హర్షం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఏ ద్వారా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెంచుతూ ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల విడుదలపై జిల్లా పార్ట్‌టైమ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కళ నెరవేరిందన్నారు.

సమైక్యాంధ్ర ఉద్యమ రోజులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో కార్మికులు 60 రోజులపాటు చేపట్టిన ఉద్యమానికి సంబంధించి ఆయా రోజులను స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటించాలని యాజమాన్యంపై అనేక సందర్భాల్లో ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేసిన ఆందోళన కారణంగా ఆరోజులను స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ప్రకటిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని ఎన్ఎంయూ రీజినల్ సెక్రటరీ సుధాకర్ వెల్లడించారు. ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులకు, రవాణాశాఖ మంత్రికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పేద మహిళలకు చీరెల పంపిణీ



పేద మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: నగరంలోని ఎన్‌జీఓ కాలనీలో ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ఎం. సురేష్‌బాబు కుమార్తె సుహిత షారూన్ 10వ జన్మదినం సందర్భంగా శుక్రవారంపేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఎన్‌జీఓ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 100 మందికి చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు రేష్మ, సుజాత, సోని, సుందరరావు, శోభారాణి పాల్గొన్నారు.

వైవీయూ భూముల సర్వే త్వరగా పూర్తి చేయాలి



రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని భూములకు సంబంధించిన సర్వే ప్రక్రియను వెంటనే పూర్తి చేసి యూనివర్సిటీకి అప్పగించాలని ఆర్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య కె.చంద్రయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగార్జున మాట్లాడుతూ విశ్వవిద్యాలయంకు సంబంధించిన భూమి అంతా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా భూముల ఆక్రమణకు పాల్పడిన కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థినాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: కమలాపురం శాసనసభ్యుడు పి. రవీంద్రనాథరెడ్డి 57వ జన్మదినం సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ తేదీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆర్. కరుణాకర్‌రెడ్డి, డి. సుబ్బరాయుడు, గోపాల్ పాల్గొన్నారు.

21నుంచి దాశరథి ఆలయంలో పవిత్రోత్సవాలు


ఒంటిమిట్ట కోదండరామాలయం

ఒంటిమిట్ట(రాజంపేట) : రెండవ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఈనెల 21 నుంచి 24 వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. 21న విష్వక్సేనారాధన, అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని టీటీడీ డిప్యూటీ ఈఓ సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. ఆలయంలో ఏడాది పొడవునా జరిగిన పలు క్రతువుల్లో తెలిసీ తెలియక చోటుచేసుకున్న దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వీటివల్ల ఏడాది పాటు యజ్ఞం చేసిన ఫలితం దక్కుతుందని అర్చకులు చెబుతున్నారు. ఈనెల 22న ఉదయం చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ట, సాయంత్రం పవిత్రహోమం నిర్వహించనున్నారు. 23న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం పవిత్రహోమాలు చేపట్టనున్నారు. 24న మహాపూర్ణాహుతి, పవిత్ర వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి సంగీతం, హరికథ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎగ్జిబిషన్ వేలం వాయిదా


వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

ప్రొద్దుటూరు టౌన్ : మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎగ్జిబిషన్ వేలం వాయిదా పడింది. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో 45 రోజులపాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌కు వేలం మున్సిపల్ కమిషనర్ శేషన్న నిర్వహించారు. రూ.50,60,000 సర్కార్ పాటగా మొదలెట్టారు. అయితే వేలానికి వచ్చిన వారు రూ.50,80,000 పాట పాడి ఆపి వేయడంతో కమిషనర్ వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వేలం పాటలో 14 మంది కాంట్రాక్టర్లు పాల్గొనగా, అధికార పార్టీకి చెందిన కొందరు వారిని వేలం పాట పాడకుండా డబ్బు ఎరచూపడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గమనించిన కమిషనర్ చివరకు వేలం వాయిదా వేశారు.

సోమవారం మళ్లీ వేలం

ఎగ్జిబిషన్ వేలాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5లక్షలు దరావత్తు చెల్లించి, రూ.10లక్షలు స్థానిక బ్యాంకు గ్యారెంటీ పత్రం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ సురేంద్రబాబు, ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు.

కాపులను బీసీలో చేరుస్తామని ఎలా భరోసా ఇస్తారు


మాట్లాడుతున్న సీమాంధ్ర బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : కాపులను బీసీలో చేర్చుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏవిధంగా భరోసా ఇస్తారని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ప్రశ్నించారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన కాపులను బీసీలో చేర్చేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. కాపుల బాధ్యత నాది వారికి నేను ఉన్నంత వరకు అన్యాయం జరగదని సీఎం చెప్పడం బీసీలను విస్మరించడమేనని తెలిపారు. బీసీలంతా ఏకమై రిజర్వేషన్లను కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు రామచంద్ర రాజు, నల్లం జగదీష్, శ్రీనివాస్, సుబ్బు, ప్రకాష్, చౌడయ్య, కృష్ణ నరసింహులు, ప్రసాద్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలపై స్పష్టత కరువు

కడప కల్చరల్ :

దేవాలయాల్లో పనిచేసే అర్చకుల్లో ఆందోళన తగ్గలేదు. వారి జీతాలను రూ. 10 వేల నుంచి సగానికి తగ్గించే ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వ అధికారులు ఇప్పటివరకు ఆ విషయం పట్ల ఎలాంటి ప్రకటన చేయకపోవడమే దీనికి కారణం. రూ. 10 వేలు తీసుకుంటున్న అర్చకులకు సగం తగ్గించి కేవలం రూ. 5 వేలే ఇచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులు సిద్ధమవుతున్నట్లు సాక్షి బుధవారం ఆధారాలతోసహా బయటపెట్టింది. ఈ విషయంపై రాష్ట్రంలోని అర్చకులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పలువురు అర్చకులు నేరుగా ఆ శాఖ కమిషనర్‌కే ఈ విషయంగా స్పష్టత కోరుతూ ఫోన్లు చేశారు...మెసెజ్‌లు పెట్టారు. దీంతో స్పందించిన ఉన్నతాధికారి ఒకరు వారందరికీ తిరిగి మెసెజ్‌లు పెట్టారు. గ్రామీణ ప్రాంతాల అర్చకులు, కొత్తగా చేరే అర్చకులకు మాత్రమే రూ. 5 వేలు ఇస్తామని, మిగతా వారిలో రూ. 10 వేలు జీతం తీసుకుంటున్న వారికి ఏమాత్రం తగ్గించబోమని మెసెజ్‌లో పేర్కొన్నారు. దీంతో అర్చకుల్లో కొద్దిగా ఆందోళన తగ్గినా ఇలా వ్యక్తిగతంగా కాకుండా నేరుగా ప్రసార మాధ్యమాల ద్వారానే ఈ విషయం ప్రముఖంగా ప్రకటిస్తారని ఎదురు చూశారు. ఆ శాఖగానీ, ముఖ్యమంత్రిగానీ ఈ విషయంగా స్పందించకపోవడంతో అర్చకుల్లో తిరిగి ఆందోళన మొదలైంది.

శాపగ్రస్తులా..?

గ్రామీణ అర్చకులు దేవాలయ భూములను సాగు చేసుకుంటున్నారు అందువల్ల వారికి ఇస్తున్న రూ.10 వేల జీతాన్ని రూ.5 వేలకు తగ్గిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. నిజానికి ఆ భూములు పేరుకు మాత్రమే అర్చకులవి. చాలా భూములు సాగుకు పనికిరాని స్థితిలో ఉన్నాయి. అర్చకుడు వాటిని పెట్టుబడి పెట్టి సాగు చేసుకునే స్థితిలో లేడు. మరికొన్నిచోట్ల భూములు ఆ ప్రాంత పెద్దల చేతిలో ఉన్నాయన్నది అందరికీ తెలిసిన సత్యం. వారు అర్చకులకు విదిలింపుగా మాత్రమే కౌలు ఇస్తున్నారు. ఇలాంటి దశలో గ్రామీణ అర్చకులు కేవలం రూ.10వేల జీతంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలోని 1,886 దేవాలయాల్లో కేవలం 100 మంది అర్చకులకు మాత్రమే రూ.10 వేల జీతం అందుతోంది. మిగతా వారు ముఖ్యంగా గ్రామీణ అర్చకులు హారతి పళ్లెంలో భక్తులు సమర్పించే కానుకలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సీజన్‌లో మినహా మిగతా రోజుల్లో రోజుకు పళ్లెం ద్వారా రూ. 20 కూడా లభించదన్నది పచ్చినిజం. ఈ దశలో అరకొర మందికి ఇస్తున్న రూ. 10 వేలు జీతంలో కోత పెట్టడం పట్ల అర్చకులు ఖిన్నులవుతున్నారు. ఈ విషయంగా నిరసన తెలిపేందుకు అర్చక సంఘాల్లో కొందరు ప్రయత్నించినా ఏదో కారణంతో ఉన్న ఉద్యోగాన్ని కూడా పీకేస్తారేమోనన్నభయంతో వారు మిన్నకుండిపోతున్నారు.



అధికారుల స్పందన ఏదీ?

అర్చకుల్లో ఆందోళన పోగొట్టేందుకు దేవాదాయశాఖ అధికారులుగానీ, ఆ శాఖ మంత్రిగానీ, ముఖ్యమంత్రిగానీ స్పందించలేదు. ఆ శాఖ మంత్రి మాణిక్యాలరావు అర్చకులను కనీసం సముదాయించేందుకు కూడా ప్రయత్నించలేదు. రాష్ట్ర బ్రాహ్మణ ఫెడరేషన్ యువజన విభాగం అధ్యక్షులు ద్రోణంరాజు రవికుమార్ మాత్రం ఈ విషయంగా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. అర్చకులకు కనీసం రూ.20 వేల జీతం ఇవ్వడం న్యాయమని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోవడంతో అర్చకుల్లో అనుమానాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వార్త అబద్ధమైతే వారెందుకు ఖండించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఆలస్యం చేయకుండా ఈ విషయంగా తమలో నెలకొన్న ఆందోళనను తగ్గించేదుకైనా దేవాదాయశాఖ మంత్రిగానీ, అధికారులుగానీ స్పష్టత ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.

విద్యుత్ అధికారుల అడ్డగింత

తొండూరు : మండలంలోని కృష్ణమగారిపల్లెలో శుక్రవారం విద్యుత్ అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాలలోకి వెళ్లితే.. తొండూరు సబ్‌స్టేషన్ అధికారులు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారంటూ ఇళ్లల్లో సోదాలు చేయడం మొదలెట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఉన్నాయనీ, ఎందుకు సోదాలు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నించారు. గ్రామంలోని ముస్లిం మహిళలు ఇళ్లల్లో స్నానాలు చేస్తున్నా, అధికారులు తలుపులు తోసుకుంటూ వెళ్లడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రజలు అధికారులను నిలదీశారు. దీంతో విద్యుత్ అధికారులు వెళ్లిపోతుంటే గ్రామస్తులు అడ్డుకుని సమాధానం చెప్పాలంటూ నిలదీశారు. చేసేది లేక అధికారులు ఎస్ఐ శ్రీనివాసులుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అధికారులు, ప్రజలతో మాట్లాడి సర్ది చెప్పారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఏపీ కార్ల్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ అత్యున్నత స్థాయి పశు పరిశోధన కేంద్రం (ఏపీ కార్ల్)ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఏపీ కార్ల్‌ను శుక్రవారం జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ జయకుమార్, సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ సోమశేఖర్, ఉద్యాన శాఖ డీడీ ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఠాగూర్ నాయక్, మత్స్యశాఖ ఏడీ చంద్రశేఖర్, డ్వామా పీడీ విజయకుమార్, తదితర ఉన్నతాధికారులు పరిశీలించారు. ముందుగా ఏపీ కార్ల్‌లో ఉన్న మౌలిక వసతులను, దొడ్డ డైయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవులు, గడ్డి పెంపకం, పరిశోధనలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ జయకుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమన్నారు. ఏపీ కార్ల్ 654 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఇందులో మౌలిక వసతుల కోసం నిర్మించిన భవనాలు 120 ఎకరాల్లో ఉన్నాయన్నారు. మిగిలిన ప్రదేశంలో మొక్కల పెంపకం, భూగర్భ జలాలు పెంపు కోసం ఇంకుడు గుంతలు, ఇతరత్రా వాటిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రైతులకు, ఇతరత్రా శిక్షణలను పులివెందులలో ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. సోషియల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ సోమశేఖర్ మాట్లాడుతూ తమ శాఖ ఆధ్వర్యంలో 20 హెక్టార్లలో మొక్కలు పెంపకం చేపడుతామన్నారు. అలాగే మరో ఐదు కిలోమీటర్లు మేర రోడ్డుకిరువైపుల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. జిల్లా డ్వామా పీడీ మాట్లాడుతూ తమ శాఖ ఆధ్వర్యంలో వర్షపు నీరు భూమిలో ఇంకేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరో 15 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేపడుతామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ జేడీలు శ్రీనివాసులు, సునీల్ కుమార్, ఏపీ కార్ల్ సైట్ ఇంజినీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్థకశాఖ జేడీ జయకుమార్

వారంరోజుల్లో పూడిక తీత పనులు ప్రారంభిస్తాం


ఇన్‌టేక్‌వెల్ వద్ద మోటర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ సంజీవరావు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె చిత్రావతి నది ఒడ్డున ఉన్న భారీ తాగునీటి పథకం ఇన్‌టేక్‌వెల్‌లో వారం రోజుల్లో పూడిక తీత పనులను ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సంజీవరావు తెలిపారు. సీబీఆర్ వద్ద నున్న భారీ తాగునీటి పథకాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పూడికతీత పనులకు సంబంధించి గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక నైపుణ్యం గల కాంట్రాక్టర్‌తో ఆయన చర్చించారు. సీబీఆర్‌లో ఉన్న ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నుంచి ఇన్‌టేక్‌వెల్‌కు నీరు రావడం లేదన్నారు. ఒక పైపులైనుకు మాత్రమే ఇన్‌టేక్ వెల్‌లోనికి నీరు వస్తుందన్నారు. దీనివల్ల నీటి కొరత ఏర్పడుతోందన్నారు. ఇన్‌ఫిల్ట్రేషన్ పైపులైన్‌లు బ్లాక్ అయ్యాయని తెలిపారు. అలాగే నదిలో ఉన్న నాలుగు ఫిల్టర్ బావులు పనిచేయడంలేదన్నారు. ప్రస్తుతం తాగునీటి కొరత నివారించేందుకు ఇన్‌టేక్‌వెల్ చుట్టూ 30మీటర్ల పరిధిలో నీటిమట్టంకన్న ఎత్తులో మట్టిని వేసి ఇన్‌టేక్‌వెల్‌లోని పూడికతీత పనులు చేపడతామన్నారు. పలు విషయాలపై ప్రాజెక్టు అధికారులతో, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలిచ్చారు... మరిచారు

- కానరాని ఆంగ్లవిద్య– ఈ హాజరు
- అమలు కాని మధ్యాహ్న భోజనం
- ఆశలపల్లకిలో ఇంటర్ విద్య


పాఠాలను బోధిస్తున్న అధ్యాపకుడు

ప్రభుత్వ కళాశాలలు	26
ఎయిడెడ్	20
మోడల్ జూనియర్ కళాశాలలు	09
సాంఘిక సంక్షేమ	
గురుకుల పాఠశాలలు	17
ఒకేషన్ జూనియర్ కళాశాలలు	11
ప్రైవేటు ఇంటర్ కళాశాలలు	88
మొత్తం విద్యార్థులు	44,259

కడప ఎడ్యుకేషన్:

ఇంటర్ విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు రకాల కార్యక్రమాలను, పథకాలను రూపొందించి అమలు చేయాలని నిర్ణయించింది. ఆంగ్లమాధ్యమ బోధన, మధ్యాహ్న భోజనం, బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొంది. సంబంధిత పథకాలను గతేడాది నుంచే అమలు చేయాలని అధికారులు ప్రకటించారు. వాటిని అమలు చేసేలోపే విద్యాసంవత్సరం గడిచిపోయింది. తాజాగా విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వీటి అమలుపై ఎలాంటి స్పష్టత లేదు. ప్రకటనలు, ప్రతిపాదనలు కార్యాలయాల మెట్లు దాటని పరిస్థితి. దీంతో ఇంటర్ విద్యపై విద్యార్థుల ఆశలు అడియాసలుగా మిగిలిపోతున్నాయి.

ఆంగ్ల విద్య అందని ద్రాక్షే:

ప్రభుత్వం 2009లో పాఠశాల విద్యనుంచే సక్సెస్‌పేరుతో ఆంగ్లమాధ్యమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యను పూర్తిచేసుకుని కళాశాలలో అడుగు పెట్టే వారు తెలుగు మాధ్యంలో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రభుత్వం ఇంటర్‌లో ఆంగ్లమాధ్యమం అమలుకు నిర్ణయం తీసుకుంది.విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇంటర్‌లో అమలు చేయాలని 2016 జనవరిలో ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాది దాటినా నేటికి అమలుకు నోచుకోలేదు.

వేలిముద్ర పడలేదు:

ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బోగస్‌ను అరికట్టి ఉపకార వేతనాల్లో పారదర్శకత కోసం ఇంటర్‌లో బయోమెట్రిక్ హాజరును నిర్ణయించింది. 70 శాతం హాజరు ఉంటేనేఈ పరీక్షలకు అనుమతి, ఉపకార వేతనాలకు అర్హత పొందుతారని నిబంధన పెట్టింది. ఈ క్రమంలో బోగస్ హాజరుతో అక్రమాలకు పాల్పడుతున్న విద్యాలయాలను కట్టడి చేయడానికి గత ఏడాది నుంచే ప్రైవేటు విద్యాలయాల్లో ఈ హాజరును నిర్దేశించారు. అయితే అది కూడా ఆచరణలోకి రాలేదు.

చొరవ చూపితే సత్ఫలితాలు:

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలవారే. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఇంటర్‌లో ఆంగ్ల విద్య, మధ్యాహ్న భోజనం, బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెడితే పేద కుటుంబాల పిల్లలకు మేలు జరుగుతుంది.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



నాపేరు ఓబులేశ్వరి, మాది రామన పల్లె. మాగ్రామం నుంచి కళాశాలకు రావాలంటే బస్సు సౌకర్యం లేదు. ఆటోలో కొద్దిదూరం వచ్చి అక్కడి నుంచి మళ్లీ బస్సులో రావాలి. అన్నం వండుకుని క్యారియర్ తెచ్చుకోవాలంటే కష్టమవుతుంది. ఒక్కోసారి మధ్యాహ్నం పస్తులుండాల్సి వస్తోంది. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పెడితే బాగా ఉంటుంది.
– ఓబులేశ్వరి, ఇంటర్, ప్రథమ సంవత్సరం. రామనపల్లె

అమలు చేస్తే మంచి ఫలితాలు



కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెడితే ఎన్నో మార్పులు వస్తాయి. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చే పేద విద్యార్థుల ఆకలిని తీర్చినవారవుతారు. బయోమెట్రిక్ హాజరు ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకత, అర్హులకు ప్రయోజనాలు అందుతాయి. తద్వారా మంచి ఫలితాలు వస్తాయి. – మస్తాన్‌సాహేబ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

దళిత వాడల్లోకి రాకుండా మంత్రి 'ఆది'ని అడ్డుకోవాలి

– వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డిని దళితవాడల్లోకి రానీయకుండా అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంపీ సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ మాట్లాడుతూ దళితులను అవమానించేలా మాట్లాడిన మంత్రిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోడం దారుణమన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని మంటగలిపిన ఆదినారాయణరెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో దళితులు టీడీపీకి ఓట్లు వేయకుండా నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి పి. సంపత్‌కుమార్, శ్యాంసన్, రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జేవీ రమణ

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఏర్పాటు చేయాలని రాయలసీమ ఎస్సీ, ఎస్టీ మానవహక్కుల కన్వీనర్ జేవీ రమణ తెలిపారు. కోటిరెడ్డి సర్కిల్ ఆర్‌సీపీ చేస్తున్న వంద రోజుల దీక్ష శుక్రవారం 43 వరోజుకు చేరుకుంది. దీక్షాశిబిరాన్ని రమణ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీమ నడ్డిబొడ్డున ఉన్న కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రభుత్వాలు చెప్పాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఏమాత్రం సహకరించడం లేదన్నారు. ఓట్లు, సీట్లు రాలేదనే అక్కసుతో చంద్రబాబు జిల్లాను విస్మరించారన్నారు. జిల్లాకు రావాల్సిన ప్రాజెక్టులు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు ఎర్రచందనం వేస్టిం గ్ సెంటర్‌లను ఇతర జిల్లాలకు తరలించి ముఖ్యమంత్రి చంద్రబాబు వివక్ష చూపడం తగదన్నారు. ఏపీలోనే అన్ని జిల్లాల కంటే కడప జిల్లాను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుబ్బారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించి సహాయ చర్యలు చేపట్టాలి


ధర్నా నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాను కరువు కింద ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కొత్త కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ రమణ, జి.చంద్ర మాట్లాడుతూ జిల్లాలోని 26 మండలాల్లో 24 శాతం వర్షపాతం లోటు ఏర్పడి విత్తనమే పడలేదని తెలిపారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణంలో కడప చివరిస్థానంలో ఉందన్నారు. రాయచోటి, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో వేసిన పంటలు ఎండిపోయాయన్నారు. ప్రతి యేటా కరువు వల్ల అప్పులు పెరిగిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. పనులు లేక కూలీలు వలసలు వెళుతున్నారని, పశువులను కబేళాలకు తరలిస్తున్నారని వివరించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రవేశపెట్టిన నీటి ట్యాంకర్ల బిల్లులు మంజూరు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతు రుణమాఫీ వల్ల ఒరిగిందేమి లేకపోగా వడ్డీలు మీదపడ్డాయని చెప్పారు. జిల్లాలో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన చేసి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, బాలచంద్రయ్య, మనోహర్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు జాతీయ సర్వే


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామిరెడ్డి

కడప రూరల్: జాతీయ అంధత్వ నివారణలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా అంధత్వ నివారణకు జాతీయ సర్వే చేపడుతున్నట్లు అఖిల భారత వైద్య సేవల సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ వశిష్ట తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో కేంద్ర ప్రభుత్వ అంధత్వ నివారణకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని 50 క్లస్టర్లలో 50 సంవత్సరాలు పైబడిన వారిని పరీక్షించనున్నట్లు చెప్పారు. 3 వేల మందికి వైద్య పరీక్షలను నిర్వహిస్తామన్నారు. అందుకోసం ఢిల్లీలోని ఎయిమ్స్ నుంచి 20 మందితో కూడిన సభ్యుల బృందం ఇక్కడికి వచ్చిందన్నారు. కంటి వ్యాధుల రాకకు కారణాలు, నివారణకు మార్గాలపై అధ్యయనం చేస్తామన్నారు. అందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ ఈ సర్వే దేశవ్యాప్తంగా 30 జిల్లాల్లో జరుగుతోందని.. అందులో వైఎస్సార్ జిల్లా ఒకటని తెలిపారు. డీఎంహెచ్‌ఓ సిబ్బంది కూడా పాల్గొంటారన్నారు. సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్స్టిట్యూట్ నుంచి వచ్చిన రిటైర్డ్ ప్రొఫెసర్, ఆ సంస్థ ఛైర్మెన్ డాక్టర్ విశ్వనాథ్, రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్‌రావు, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ బుసిరెడ్డి పాల్గొని తగు సలహాలు, సూచనలు అందించారు.

పేదలకు ప్రభుత్వ భూములు కేటాయించండి


మాట్లాడుతున్న బి.నారాయణ

కడప వైఎస్సార్ సర్కిల్ : కాశినాయన మండలం అక్కెంగుండ్ల, సావిశెట్టి పల్లె రెవిన్యూ గ్రామంలో ఉ్న ప్రభుత్వం భూమిని పేదల ప్రజలకు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బి. నారాయణ తెలిపారు. శుక్రవారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశినాయన మండలంలో బినామీదారులు రెండు వేల ఎకరాలు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారని కనీసం అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఏడు విడతలుగా జరిగిన భూ పంపిణీలో పేదలకు కాకుండా అగ్రవర్ణాల వారు దక్కించుకున్నారన్నారు. బినామీల దగ్గర ఉన్న ప్రభుత్వ భూములను రద్దు చేయాలని నాలుగు నెలలుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భూములు కబ్జాకు గురైన విషయాన్ని అఖిలపక్ష కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తెసుకెళ్లినట్లు చెప్పారు. కలెక్టర్ విచారణకు ఆదేశించారన్నారు. ఈ నెల 17 నుంచి రాజంపేట ఆర్‌డీఓ వీరబ్రహ్మ ఆధ్వర్యంలో ఆరు టీంలు విచారణ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం డీకేటీ భూములను పేదలకు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గండికోటకు వారసత్వ
హోదాపై కదలిక

కడప కల్చరల్ :

గండికోటకు యునెస్కో గుర్తింపు ఫైలు మరోమారు కదిలింది. కేంద్ర ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా నిర్దేశకులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (రాష్ట్ర) అమరావతి శాఖ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు డాక్టర్ శ్రీలక్ష్మికి ప్రత్యేకంగా ఉత్తరం రాశారు. గండికోటకు యునెస్కో గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర పురావస్తుశాఖ అవసరమైన వివరాలను పంపాలని గుంటూరుకు చెందిన పర్యాటకాభిమాని న్యూఢిల్లీకి చెందిన అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి, అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు అభ్యర్థించారు. స్పందించిన ప్రవీణ్‌కుమార్‌మిశ్రా రాష్ట్రశాఖ అధికారి శ్రీలక్ష్మికి ఉత్తరం రాస్తూ గండికోటకు సంబంధించిన వివరాలను వెంటనే తమకు పంపాలని లేఖ రాశారు.

మళ్లీ కదలిక..

2016 యునెస్కో సూచనల మేరకు ప్రత్యేక ఫార్మెట్‌లో గండికోటకు సంబంధించిన అన్ని అంశాలను సవివరంగా సేకరించి వెంటనే తమకు పంపాలని ప్రవీణ్‌కుమార్ మిశ్రా తన లేఖలో కోరారు. యునెస్కో -2017 సూచనల ప్రకారం వివరాలు తనకు అందిన వెంటనే యునెస్కోకు పంపుతామని, వారి పరిశీలనంతరం గండికోటను ప్రపంచ వారసత్వ నిర్మాణంగా గుర్తిస్తూ యునెస్కో ప్రచురించే తాత్కాలిక జాబితాలో చోటు కల్పిస్తామని ఆయన లేఖలో పేర్కొన్నారు.

- నిజానికి 2016 సెప్టెంబరులో గుంటూరుకు చెందిన జాస్తి వీరాంజనేయులు కేంద్ర పురావస్తు శాఖాధికారులను కలిసి రాష్ట్ర శాఖ ద్వారా వివరాలు సేకరించి గండికోటను యునెస్కో తాత్కాలిక జాబితాలో పొందుపరచాలని కోరారు. కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రాష్ట్రశాఖ అధికారులకు ఈ విషయంగా గడువును నిర్దేశించారు. కానీ ఆ గడువులోపుగా రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు గండికోట వివరాలు పంపలేక పోవడంతో మరో రెండు, మూడు నెలలు గడువును పొడిగించారు. అయినా ఫలితం లేకపోవడంతో అక్కడితో ఫైలు ఆగిపోయింది.
- జాస్తి వీరాంజనేయులు మరోమారు ఈ విషయంగా కేంద్ర పురావస్తుశాఖ అధికారులను కలిసి రాష్ట్ర అధికారుల ద్వారా గండికోట వివరాలను తెప్పించుకోవాలని, లేకుంటే ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఉన్న వారసత్వ హోదాకు అన్ని విధాలుగా తగిన అర్హతలున్న గండికోటకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని వరుసగా వినతిపత్రాలు సమర్పించారు. స్పందించిన ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా నిర్దేశకులు ప్రవీణ్‌కుమార్‌మీనా ప్రత్యేకంగా రాష్ట్ర అధికారిణి శ్రీలక్ష్మికి ఉత్తరం రాశారు. గండికోట ప్రపంచ స్థాయి వారసత్వ సంపదకు అర్హమైనదని, ఆ ప్రాంత పర్యాటక సంస్థలు, అభిమానులు చెబుతున్నారని, గండికోట వివరాలను వెంటనే పరిశీలించి సమగ్రమైన నివేదిక పంపాలని కోరారు.

అవిశ్రాంతంగా అధికారులు..

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో గండికోట ఉత్సవాల అనంతరం జిల్లా కలెక్టర్, పర్యాటకశాఖ ఆర్డీ, జిల్లా పర్యాటకశాఖాధికారి తామే బాధ్యత తీసుకుని ఓ కన్సెల్టెంట్ ద్వారా గండికోట వివరాలను సేకరించి రాష్ట్ర శాఖకు పంపాలని ప్రయత్నించారు. కానీ ఫైలు రాష్ట్ర స్థాయిలో ఆగిపోవడంతో పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అయినా అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

- గండికోటలో పర్యాటకులకు అన్ని రకాల వసతులు, ఆకర్శణలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మూడుసార్లు కోటలో సమావేశాలు ఏర్పాటు చేసి స్థానికుల సహకారం తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా సాహస క్రీడల కోసం సర్వే, ఇతర ఏర్పాట్లు నిర్వహించారు. ఈసారి ఉత్సవాలలోపు గండికోటను అన్ని వసతులు గల పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న పట్టుదల అధికారుల్లో కనిపిస్తోంది. దీనికితోడు ప్రస్తుతం రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు కేంద్ర శాఖ కోరినట్లుగా గండికోట వివరాలను పంపితే యునెస్కో తాత్కాలిక గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తమవంతుగా పూర్తి సహకారాన్ని అందించాలని పర్యాటకాభిమానులు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలి..



ఫొటోగ్రఫీ రంగంలో ప్రొఫెషనల్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలి. స్థానిక ఫొటోగ్రాఫర్ల కోసం ఇటీవల పెద్ద నగరాల నుంచి సీనియర్ ఫొటోగ్రాఫర్లను రప్పించి ఆధునిక టెక్నాలజీ, ఫొటో మోడలింగ్‌లను పరిచయం చేశాం. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. - పద్మప్రియ చంద్రారెడ్డి, అధ్యక్షుడు, రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం

ఫొటోలు తీయడం ఒక ప్రత్యేకమైన కళ. ఫొటోలు ఓ జ్ఞాపక
పసితనం వీడనపుడు అయామకంగా ఉండే ముఖాలతో తీయి
య్యాక చూసుకుంటే మనసు ఆరోజుల్లోకి వెళ్లి మైమరిచిపోతా
వార్షికోత్సవం, పెళ్లిరోజు నుంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనం,
బాల్యంనుంచి జీవిత చరమాంకం వరకు ఫొటోలు తీయించు
సందర్భం ఏదైనా ఫొటోలు మాత్రం జ్ఞాపకాలుగా మిగిలి ఉంటా
కళ్ల ముందుంచే ఫొటోగ్రఫీ కేవలం హాబీ మాత్రమేకాదు. మంచి
న్నారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం. కెమెరా పితామ
లభించిన రోజును ఫొటోగ్రఫీ దినోత్సవంగా నిర్వ

చిత్రం.. జ్ఞాప



నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మన జిల్లాలో...

జిల్లాలో ప్రస్తుతం 250కి పైగా ఫొటో స్టూడియోలు ఉన్నాయి. ఫొటోగ్రఫీ సరంజామా అమ్మే దుకాణాలు 30కి పైగా ఉన్నాయి. కడప నగరం పోతుల డిజిటల్స్ స్టూడియోలో అత్యాధునికమైన ఫొటోగ్రఫీ యంత్రాలు ఉన్నాయి.
- వాల్ పోస్టర్ సైజు ఫొటోను ఏమాత్రం రంగు, నాణ్యత చెడకుండా ప్రింట్ తీసుకోవచ్చు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై మూడు వేల మందికి పైగా ఆధారపడి జీవిస్తున్నారు.

చరిత్ర ఇదీ!

- ఫొటోగ్రఫీ అనే పదం గ్రీకు భాషకు చెందినది.
- 1826లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త జోసెఫ్ నైసిఫర్ సిన్సి తొలి కెమెరాను రూపొందించారు. 1839 ఆగస్టు 19న డాగురె పూర్తి స్థాయి కెమెరాను రూపొందించారు.
- 1850 నుంచి ఫొటోగ్రఫీ కళగా అభివృద్ధి చెందింది.
- 1884లో అమెరికాకు చెందిన జార్జి ఈస్టమన్ ఫొటోఫిల్మ్‌ను కనుగొన్నారు. తర్వాత ఆయనే రంగుల ప్రింటింగ్‌ను కనుగొన్నారు.

ఫోటోగ్రాఫర్లు, స్టూడియోలు..

కడప నగరానికి చెందిన ఎన్.వెంకటేశ్వర్లు (90) సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు సాధించారు. 1937లో పదేళ్ల వయస్సులో ఫొటోలు తీసి నాటి కలెక్టర్ వీఎస్ హెజ్‌మాడి అభినందనలు సంపాదించారు. నాటి ఆంగ్ల పత్రికలకు ఫొటోలు అందజేసేవారు. పలువురు రాష్ట్రపతులు, ప్రధానులు జిల్లాకు వచ్చినపుడు ఆయనే ఫొటోలు తీసేవారు. కడప నగరానికి చెందిన రాయల్ రషీద్ 1950 నుంచి ఫొటోగ్రఫీ రంగంలో ఉన్నారు. రాయల్ ఫొటోస్టూడియోను స్థాపించారు. తొలితరం దినపత్రికలకు ఫొటో గ్రాఫర్‌గా, ప్రభుత్వ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. నేటికీ ఈ రంగంలో కొనసాగుతున్నారు.

కడప కల్చరల్ :


వెయ్యి పేజీల సమాచారాన్ని ఒక్క ఫొటో ద్వారా చెప్పవచ్చని పెద్దలు అంటారు. ప్రచార రంగంలో కూడా ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎన్టీఆర్ బస్సు యాత్ర, వైఎస్సార్ పాదయాత్రల నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు సాగించిన ప్రస్థానంలో ప్రసార మాధ్యమాల పాత్ర ప్రశంసనీయం. నానాటికి ఫొటోగ్రఫీకి ప్రాధాన్యత పెరుగుతోంది.

- మూడేళ్ల బాలుడు నుంచి కార్పొరేట్ ఉద్యోగి వరకు మెడలో ఐడెంటిటీ రూపంలో ఫొటో కార్డులు కనిపిస్తాయి. బ్రిటీషు కాలం నాటి రోలికార్డ్ రైస్‌ల్యాండర్ రోలిఫ్లెక్స్ లాంటి కెమెరాల నుంచి రూ.10 లక్షలు విలువజేసే కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి.
- మొన్నటితరం నాటి క్లిక్-3 కాలం నుంచి ఫొటోగ్రఫీ డ్రోన్ కెమెరాల స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ఫొటోగ్రఫీలో మొబైల్ ఫోన్ల రాక ఈ రంగాన్ని కొత్త మలుపు తిప్పింది. కేవలం ఫొటోల కోసమే ఫోన్లను రూపొందిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

జిల్లాలో...

- ఒకప్పుడు అరకొరగా ఉండిన ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ ఇప్పుడు ఒక వివాహానికి రూ. 4 లక్షలు ఛార్జి చేసే స్థాయికి ఎదిగింది. ప్రొద్దుటూరులో తొలి ఫొటోగ్రాఫర్లు వాసు బ్రదర్స్, కడప నగరంలో బాంబే స్టూడియో, దేవి, జెమిని, మూర్తి, జై జవాన్-జైకిసాన్ స్టూడియోలు ఎంతో పేరు గడించాయి. కడప నగరంలో కృష్ణమూర్తి, నంజుడయ్య తొలి ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్లుగా పేరు తెచ్చుకున్నారు.

రికార్డు స్థాయి కెమెరాలు..





...ాల దొంతర. చిన్నప్పుడు
...ంచుకున్న ఫొటోలు పెద్ద
...ం. పుట్టినరోజు, పాఠశాల
... రిటైర్‌మెంట్ ఫంక్షన్ ఇలా
...కునే సందర్భం వస్తుంది.
...యి. తీయని గతాన్ని నేటికీ
...వృత్తిగా కూడా చేపడుతు
...హుడు దాగురేకు పేటెంట్
...హిస్తున్నాం.





...కం

...డప నగరానికి చెందిన గంగుల యల్లేశ్వరరావు ... దాదాపు 40 రకాల కెమెరాలు ఉన్నాయి. వాటి ... తొలితరం నుంచి నేటి అత్యాధునిక కెమె...ను కూడా ఆయన సేకరించి ఉంచారు. స్పీడ్ ...ఫిక్ కెమెరానుంచి ఇన్‌ఫారెడ్ రిమోట్ కెమెరాలు ...డా ఆయన వినియోగిస్తున్నారు. స్వంతంగా ...ల్‌పోస్టర్ సైజ్ ప్రింట్‌ను నాణ్యత చెడకుండా ...లార్జ్ చేసేందుకు అవసరమైన సాంకేతిక ...జ్ఞానాన్ని స్వంతంగా రూపొందించుకున్నారు. ... అటవీ ప్రాంతాల్లో పక్షులు, జంతువుల ...కిని ఫొటోలు తీసే రైఫిల్ స్టాక్ రకం కెమెరా ...డా ఈయన వద్ద ఉంది. కెమెరా బాడీలు, ...డ్‌లు, లెన్స్‌లు, రిమోట్లు, ఫిల్మ్‌లు, చిప్‌లు, ...తో ఆయన ఇల్లు ఓ కెమెరాల మ్యూజియాన్ని ...పిస్తుంది. పలు ప్రభుత్వ కార్యక్రమాలకు ...ల్లేశ్వరరావు ఫొటోగ్రాఫర్‌గా సేవలందిస్తు...రు.



శ్రద్ధ చూపితే మంచి ఉపాధి..



ఫొటోగ్రఫీపై శ్రద్ధ చూపితే మంచి ఉపాధిగా మార్చుకోవచ్చు. దీనికి అవసరమైన సరంజామా ఖరీదు కాస్త ఎక్కువే! కానీ తక్కువ ఛార్జీతో నాణ్యతగల ఫొటోలను అందజేస్తే మంచిపేరు లభిస్తుంది. చెప్పిన సమయానికి ఫొటోలు ఇవ్వాలి. క్రమశిక్షణ ముఖ్యం. **- పోతుల వెంకట్రామిరెడ్డి,** యజమాని, పీవీఆర్ డిజిటల్ స్టూడియో, కడప

భావాన్ని ఫొటోతో తెలియజెప్పవచ్చు...



వెయ్యి పదాలతో చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటోతో చెప్పొచ్చు. ఒక కెమెరా క్లిక్‌తో సమస్యను కళ్లకు కట్టినట్టు.. సామాన్యులకూ అర్థమయ్యేలా చూపించవచ్చు. గత జ్ఞాపకాలన్నీ ఫొటోలో పదిలంగా ఉంటాయి. అందుకే ఫొటో జీవితంలో ఓ మధుర జ్ఞాపకం. ప్రభుత్వాలు ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం మంచి పథకాలు ప్రకటిస్తే బాగుంటుంది. అదే విధంగా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలి.

- గణేష్, ఫొటోగ్రాఫర్, మంత్ర ఫొటోస్టూడియో, కడప

నిత్య విద్యార్థి కావాలి...



ఫొటోగ్రాఫర్ నిత్య విద్యార్థిగా ఈ రంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలి.కెమెరాలు, మిగతా సరంజామా ఖరీదు చాలా ఎక్కువ. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైనపుడు ఆదుకునేందుకు ప్రభుత్వం, సంఘాలు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. సెల్ రాకతో ఫొటోగ్రాఫర్లకు డిమాండ్ తగ్గింది. **- వి.శ్రీకాంత్, శ్రీకాంత్‌స్టూడియో, రాజంపేట**



రాయచోటి ఏరియా ఆసుపత్రి జనరల్ వార్డులో ఉన్న ఆక్సిజన్ సిలిండర్



పొద్దుటూరు ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు



రోగులతో రద్దీగా ఉన్న రాయచోటి ఏరియా ఆసుపత్రి

ప్రస్తుతానికి సిలిండర్ల కొరత లేదు..



మా ఆస్పత్రిలో ఇంత వరకూ ఆక్సిజన్ కొరత రాలేదు. మాకు ఉన్న 25 సిలిండర్లలో రోజుకు 6–7 సిలిండర్లు ఖాళీ అవుతుంటాయి. వాటి స్థానంలో అదే రోజు ఫుల్ సిలిండర్లు నింపుతున్నాం. అత్యవసర సమయంలో అదనంగా సిలిండర్లు కావాల్సి వస్తే పక్కనే ఎర్రగుంట్లలో ఉన్న ప్లాంట్ల నుంచి తెప్పిస్తాం.

- లక్ష్మీప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్.

ఆక్సిజన్ తక్కువ రాకుండా చూస్తున్నాం



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో వస్తున్న రోగులకు అనుగుణంగా , తక్కువ రాకుండా ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుతున్నాము. ప్రతి నెలా 4–5 సిలిండర్లు అయిపోతున్నాయి. ఉన్న 9వార్డుల్లో 9 ఆక్సిజన్ సిలిండర్లు ఉంచాం. వీటితో పాటు ఆసుపత్రిలో ప్రస్తుతం 2 ఆక్సిజన్ మిషన్లు ఉన్నాయి. అదనంగా మరి కొన్ని మిషన్లు కావాలని ప్రతిపాదనలు పంపాం.

- సహదేవయ్య. సూపరింటెండెంట్, రాయచోటి ఏరియా ఆసుపత్రి

ముందే మేల్కొందాం...

ప్రాణం కాపాడుదాం

• అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ సిలిండర్లు ఉంచాలి • అప్రమత్తంగా ఉంటే గోరఖ్‌పూర్ ఘటనలకు చెక్

రాయచోటి రూరల్ : రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మొత్తం 9 వార్డులు ఉండగా, అందులో 9 ఆక్సిజన్ సిలిండర్ ఉన్నాయి. అలాగే అన్ని వార్డుల్లో ఆక్సిజన్ మిషన్లు ఉండాల్సి ఉంది. అయితే కేవలం రెండు మాత్రమే మిషన్లు ఉన్నాయి. మరి కొన్ని ఆక్సిజన్ మిషన్లు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

• రాయచోటి ఏరియా ఆసుపత్రిలో జనరల్ ఉమెన్, మెన్ వార్డులతో పాటు నవజాత శిశువులకు సంబంధించి మొత్తం 3 వార్డులు, జనరల్ క్యాజువాలిటీ వార్డు –1, ఎమర్జెన్సీ వార్డు, కాన్పుల వార్డు, ఆపరేషన్ థియేటర్ వార్డులు ఉన్నాయి . వీటిలో ఉండాల్సిన ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయి. అయితే అన్నింటిలో నిరంతరం ఆక్సిజన్ సిలిండర్లతో పాటు ఆక్సిజన్ మిషన్లు కూడా ఉండాలి. అయితే రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మాత్రం కేవలం రెండు మిషన్లు మాత్రమే ఉండగా, వాటిని ప్రస్తుతం ఎమర్జెన్సీ వార్డు, ఆపరేషన్ థియేటర్ వార్డులో మాత్రమే ఉపయోగిస్తున్నారు.

• రాయచోటి నియోజకవర్గంలో 7 పీహెచ్‌సీలు ఉండగా, ఎక్కడా కూడా ఆక్సిజన్ సిలిండర్లు లేవు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో కచ్చితంగా నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి రావాల్సి వస్తోందని రోగులు అంటున్నారు.

పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేయాలి



మండలాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మిషన్లు అందుబాటులో ఉంచాలి. అత్యవరసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి తప్పకుండా రాయచోటికి లేదా కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచాలి. **- అభిషేక్, చిన్నమండెం మండలం**

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి పట్టణంతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున రోగులు వస్తుంటారు. రోజుకు 800 దాకా ఓపీ ఉంటుంది. ఆస్పత్రిలో 25 ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయి. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, క్యాజువాలిటి, రెండు ఆపరేషన్ థియేటర్లు, మెడికల్ వార్డు, చిన్న పిల్లల విభాగం, ఎస్ఎన్‌సీయూ, ప్రసూతి, తదితర విభాగాల్లో ఆక్సిజన్ సిలిండర్లు అవసరం అవుతాయి.

• రోజుకు 6–7 సిలిండర్లు చొప్పున నెలకు సుమారు 200 వరకు అవసరం అవుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. గతంలో 20 సిలిండర్లు ఉండగా ఇటీవల 5 సిలిండర్లు వచ్చాయని తెలిపారు. ఎర్రగుంట్లలోని వంశీ ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి సిలిండర్లను సరఫరా చేస్తారు.

రోజువారి సేవలకైతే ఇబ్బంది లేదు..

ఆస్పత్రిలో రోజు వారి సేవలకైతే ఎలాంటి ఇబ్బంది ఉండదని, అయితే ఒక్కసారిగా అత్యవసర కేసులు ఎక్కువ సంఖ్యలో వస్తే మాత్రం ఇబ్బందికర పరిస్థితి తప్పదని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రిలో 25 సిలిండర్లు ఉన్నప్పటికీ ఒక్కో విభాగానికి 2,1 మాత్రమే ఉన్నాయి. అత్యవసర విభాగంలో మాత్రం నాలుగు ఉన్నాయి. రోడ్డు ప్రమాద, ఏదైనా అనుకోని విపత్తు జరిగి ఆస్పత్రికి అత్యవసర కేసులు వస్తే మాత్రం ఇతర విభాగాల్లో ఉన్న సిలిండర్ల కోసం పరుగులు తీయాల్సిందే.

అరకొరగా ఆక్సిజన్



సీమాంక్ ఆపరేషన్ థియేటర్‌లో చిన్న సిలిండర్లు

రాజంపేట : పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట ఏరియా ఆసుపత్రిలో ఆక్సిజన్ సిలిండర్లు అరకొరగా ఉన్నాయి. పెద్దాసుపత్రి కనీసం 30 సిలెండర్లు అందుబాటులో ఉంటే ఏ క్షణమైనా.. ఎంతమంది రోగులకు అయినా చికిత్స అందించవచ్చు. ప్రస్తుతానికి ఓపీబ్లాక్‌కు సంబంధించి 12 సిలిండర్లు ఉన్నాయి. అయితే ఒక రోగికి రాత్రంతా పెట్టాల్సిన పరిస్థితి వస్తే 15 రోజులకే ఈ సిలెండర్లు సరిపడతాయి.

• కడప–రేణిగుంట నేషనల్ హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాప్రాయంలో ఉన్నప్పుడు అవసరమైన పరిస్థితిలో ఆక్సిజన్ పెట్టాల్సి వస్తే అప్పుడు వైద్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సగటున 30 సిలిండర్లు అందుబాటులో ఉంటే ఆక్సిజన్ అనేది కొరత లేకుండా ఉంటుందనే భావన వైద్యసిబ్బందిలో నెలకొంది.

సీమాంక్‌లో మూడు చిన్నసిలిండర్లు..

సీమాంక్ సెంటర్‌లో మూడు చిన్న సిలిండర్లు ఉన్నాయి. ఇందులో ఒకటి ఖాళీ కావడంతో రెండు సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. సీమాంక్‌లో ఆపరేషన్లు రెఫర్ లేకుండా ఉంటే ఈ మూడు సిలిండర్లు కూడా శస్త్రచికిత్సలో భాగంగా సరిపోవనేది సమాచారం.

ఆక్సిజన్ నింపుకోవాలంటే..

ఏరియా ఆసుపత్రికి ప్రస్తుతం ఉన్న ఆక్సిజన్ సిలిండర్లకు ఆక్సిజన్ నింపుకోవాలంటే పురిటికష్టాలు అనే కం ఉన్నాయి. ఆక్సిజన్ సిలిండర్లను కడపకు తీసుకెళ్లి పట్టించుకునేందుకు, రవాణాకు ఎటువంటి నిధులేవు. కేవలం ఆసుపత్రి అభివృద్ధి క మిటి నిధుల నుంచి వినియోగించుకోవాల్సిన పరిస్థితి.

నిర్లక్ష్యంపై కలత చెంది..

▶ మొదటిపేజీ తరువాయి

జరిగింది. రోజు నంద్యాల నుంచి వచ్చి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు.

ఆపరేషన్ సమయంలో సూది గుచ్చుకోవడంతో..

కొన్నిరోజుల క్రితం ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి డాక్టర్ డేవిడ్‌రాజ్ ఆపరేషన్ చేశాడు. అతనికి మొదట పరీక్షలు నిర్వహించి హెచ్ఐవీ నెగిటివ్ అని చెప్పడంతో డాక్టర్ కనీస జాగ్రత్తలు తీసుకోకుండా శస్త్రచికిత్స చేశాడు. ఆపరేషన్ చేసే సమయంలో డాక్టర్‌కు సూది గుచ్చుకుంది. కొన్నిరోజుల తర్వాత అతనికి హెచ్ఐవీ పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ రోజు నుంచి ఆ పేషెంట్‌ను పిలిపించి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాడు. అదే క్రమంలో డాక్టర్ కూడా పరీక్ష చేసుకుంటున్నాడు. ఇలా డాక్టర్ గత కొన్నిరోజుల నుంచి తీవ్ర మానసిక వ్యథను అనుభవిస్తున్నాడు. అసలే గుండె పోటు, దానికి తోడు గుచ్చుకున్న సూది విషయంలో ఆయన మదనపడేవాడు. తనకు కలిగే ఆందోళన, మానసిక వ్యథను నిర్లక్ష్యానికి కారకులైన వారు కూడా అనుభవించాలని అతను నిత్యం భావించేవాడు. ఇందులోభాగంగానే శుక్రవారం ఎంఎం2 వార్డులో ఉన్న హెచ్ఐవీ రోగి రక్తాన్ని సేకరించాడు. వార్డులోని నర్సు వారిస్తున్న డాక్టర్ వినిపించుకోకుండా



ఆస్పత్రిలో చర్చించుకుంటున్న డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐ సదాశివయ్య (ఇన్‌సెట్లో) ఆర్థో వైద్యుడు డేవిడ్ రాజ్

రక్తాన్ని తీసుకున్నాడు. ఆ సిరంజితోనే ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌పై దాడి చేశాడు.

వార్డులోని పేషెంట్ ఏమయ్యాడు..

డాక్టర్ డేవిడ్‌రాజ్ గురువారం ఒక వ్యక్తికి ఆపరేషన్ చేసి ఆర్థో వార్డులో అడ్మిట్ చేశాడు. అయితే శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా అతను వార్డులో కనిపించ లేదు. ఎక్కడికి వెళ్లాడని నర్సింగ్ సిబ్బందిని ప్రశ్నించగా వారు తెలియదని చెప్పారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన డాక్టర్ డేవిడ్‌రాజ్ నేరుగా ఆర్ఎంఓ డేవిడ్ సెల్వరాజ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. తన వార్డులో ఉన్న పేషెంట్లు మాత్రమే బయటికి వెళ్తున్నారని, మిగతా వార్డుల్లో మాత్రం ఇలా జరగలేదన్నారు. కొందరు దళారులు భయపెట్టి బయటి ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారని ఆయన అన్నాడు. గతంలో కూడా దీనిపై ఫిర్యాదు చేశానని, అయినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. సూపరింటెండెంట్, ఆర్ఎంఓ అందరూ పనికిరాని వారుగా మారని ఆయనపై ధ్వజమెత్తారు. అక్కడి నుంచి నేరుగా సూపరింటెండెంట్ వద్దకు వెళ్లి హెచ్ఐవీ సిరంజితో దాడి చేశారు.





సూపరింటెండెంట్ ఉన్న గది ఎదుట గుమి కూడిన సిబ్బంది

కలత చెంది ఇలా చేశా..

ఆస్పత్రిలో జరుగుతున్న కొన్ని సంఘటనలు తనను తీవ్రంగా బాధించాయని ఆర్థో సర్జన్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఆస్పత్రికి డీసీహెచ్ఎస్ జయరాజన్ జరిగిన సంఘటనపై సూపరింటెండెంట్, వైద్యులతో చర్చించారు. ఆర్థో సర్జన్‌ను పిలిచి మాట్లాడగా తన ఆవేదనను డీసీహెచ్ఎస్ వద్ద వ్యక్త పరిచారు. ఆపరేషన్ చేస్తున్నప్పుడు సూది గుచ్చుకోవడంతో హెచ్ఐవీ సోకుతుందేమోనని ఆందోళన చెందానని తెలిపాడు. బైపాస్ సర్జరీ కారణంగా తాను నిత్యం ఎంతో ఇబ్బంది పడుతున్నానని, ఈ బాధ తెలియాలనే ఉద్దేశంతోనే హెచ్ఐవీ సిరంజితో సూపరింటెండెంట్‌పై దాడికి ప్రయత్నించినట్లు డీసీహెచ్ఎస్‌కు వివరణ ఇచ్చాడు. కాగా డేవిడ్‌రాజ్‌పై శాఖాపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు. అంతవరకూ సెలవులో వెళ్లాలని ఆదేశించారు.

డీఎస్పీ విచారణ

విషయం తెలియడంతో డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. ముందుగా జరిగిన సంఘటనపై సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. తర్వాత డాక్టర్ డేవిడ్‌రాజ్‌ను విచారణ చేశారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సూపరింటెండెంట్‌తో అన్నారు. అయితే ఉన్నతాధికారులతో మాట్లాడి ఫిర్యాదు చేయాలా వద్దా అనేది తర్వాత చెబుతామన్నారు. కాగా సూపరింటెండెంట్‌పై దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. సూపరింటెండెంట్ శరీరంలోకి సూది గుచ్చుకోలేదని ఏఆర్‌టీ కోఆర్డినేటర్ సురేష్ తెలిపారు.

ఘనంగా గంధం ఉత్సవం

కడప కల్చరల్: కడప నగరం వన్‌టౌన్ వద్ద గల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా మోహర్ అలీషా దర్గా గంధం ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లాబాష సాహెబ్ తమ ఇంటి వద్ద నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళాలు, సాహస విన్యాసాలతో దర్గా వద్దకు చేర్చారు. దర్గాలో పూల చాదర్లు సమర్పించి అనంతరం గంధం సమర్పించారు. ఫాతెహా చేసి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో నగర ముస్లిం ప్రముఖులు, దర్గా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



గంధం కలశాన్ని తీసుకు వస్తున్న దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లాబాష సాహెబ్

నిమ్మ తోటలపై తెగుళ్ల దాడి..

సకాలంలో నివారించుకోవాలి

కడప అగ్రికల్చర్ :

జిల్లాలో నిమ్మ(పులుసు)తోటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే ఏడాదంతా కాపులో ఉంటూ మంచి ఆదాయాన్నిచ్చే పంట ఇది. ఈ పంటతోటలను బ్యాక్టీరియా, శిలీంద్రాలు, రసం పీల్చే పురుగులు కాయ దశలో కూడా ఆశించి రైతులకు అపారమైన నష్టాన్ని కలుగజేస్తున్నాయని కడప ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరక్టర్ వెంకటేశ్వరరెడ్డి చెబుతున్నారు. గజ్జి తెగులు, మంగు, నల్లి, తామర పురుగులు, తెల్లమచ్చల తాకిడి ఉంటోందని పేర్కొన్నారు. సకాలంలో నిమ్మ చెట్లకు మందులను పిచికారి చేయకపోతే ఈ తెగుళ్ల నివారించడం కుదరదని రైతులకు సూచిస్తున్నారు.

నిమ్మకాయను ఆశించే తెగుళ్లు....:

గజ్జి తెగులు(బొబ్బర తెగులు)

ఈ తెగులు జాంతోమోనాస్ ఆక్సనోపొడిసిపివిసిట్రి అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. ఇది ఆశిస్తే నిమ్మకాయల మీద గజ్జిమచ్చలు విపరీతంగా వస్తాయి. మచ్చలు పసుపు పచ్చరంగులో ఉండి, క్రమంగా విస్తరించి ఉబ్బెత్తుగాను, గరుకుగాను, గోధుమ రంగులో ఉంటాయి. ఈ మచ్చల చుట్టూ పసుపుపచ్చని చార ఏర్పడుతుంది.

నివారణ...

- గజ్జి తెగులును తట్టుకునే రకాలు(బాలాజీ నిమ్మ, పెట్లూరు సెలెక్షన్-1 రకాలను) సాగు చేసుకోవాలి.
- స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము, కాఫర్ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ మందులను వర్షాకాలంలో లేత చిగుర్లపై 20 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారి చేయాలి.
- మొదటగా ఆకుముడత(మజ్జిగ తెగులు) నివారణకు థయోమిక్సాం 10 గ్రాములు, డైక్లోరోవాస్ 5 మిల్లీ లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి.

స్కాబ్ తెగులు..


ఈ తెగులు ఎల్సినోయి ఫాసెట్టి బిటానోకోర్డ్ శిలీంద్రం ద్వారా వస్తుంది. నిమ్మకాయ మీద ఉబ్బెత్తుగా పసుపు-ఆరంజ్ రంగులో ఉండే మచ్చలు గుర్తించవచ్చు. ఉబ్బెత్తుగా ఉన్న మచ్చలు విడిపోయి స్కాబ్‌లాగా తయారై కనిపిస్తాయి.

నివారణ...

బోర్డాక్స్ మిశ్రమం 1 గ్రాము, కార్బండిజమ్ 1 గ్రాము లేదా థయోఫానెట్ మిథైల్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలపి పిచికారి చేయాలి.



నిమ్మచెట్టును ఆశించిన మంగునల్లి



నిమ్మకాయలను ఆశించిన పిండినల్లి

కాయతొడిమ కుళ్లు తెగులు...

ఈ తెగులును గ్లియోస్పోరియం లిమ్మెటికోలా అనే శిలీంద్రం కలుగజేస్తుంది. తొడిమకు కాయ పుట్టే చోట శిలీంద్రం లోనికి ప్రవేశించి అటు కాయకు, ఇటు తొడిమకు కుళ్లను కలుగజేస్తుంది. మొదట కాయ తొడిమవైపున గోధుమ రంగులో వలయాకారపు మచ్చలేర్పడి, క్రమేపీ కుళ్లు కాయంతా వ్యాపిస్తుంది. రోజులు గడిచేకొద్ది గోధుమ రంగు, వక్కరంగుకు మారుతుంది.

నివారణ....

చెట్టులో కుళ్లిన, ఎండిన కాయల్ని తొడిమతో సహా కత్తిరించి పోగుచేసి నాశనం చేయాలి. తర్వాత 10 గ్రాముల కార్బండిజమ్ మందును 10 లీటర్ల నీటితో కలిపి ఒక నెల వ్యవధిలో మూడు ఆకులు, కాయలమీద పిచికారి చేయాలి.

నిమ్మకాయలను ఆశించే పురుగులు

మంగునల్లి(మంగు)...

ఈ పురుగులు లేత కాయలను ఆశించి పీల్చివేస్తాయి. కాయల మీద ముదురు గోధుమ రంగు లేదా ఊదారంగు ఏర్పడటాన్ని మంగు అంటారు. మంగు ఆశించిన కాయలు చిన్నవిగా తోలు గట్టిగాను, పెలుసుగా ఉండి చూడటానికి బాగుంటుంది. ఈ పురుగుల ఉధృతి కాయలమీద సెప్టంబర్ నుంచి మార్చి నెల వరకు ఉంటుంది.

నివారణ.....

మంగు నివారణకు వెట్టెబుల్ సల్ఫర్ 3 గ్రాములు, ఇథియాన్ 1.5 మిల్లీలీటర్లు లేదా ప్రాపర్గైట్ 1.5 మిల్లీ లీటర్లు లేదా డైకోఫాల్ 3 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి బఠానీ, గోళీకాయ దశ, కాయసైజు రాని దశలోనే మందులను మార్చి మార్చి పిచికారి చేస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది.

తెల్లదోమ (పురుగు నాకేవిధానం)..,.

తామర మచ్చలు కాయల నుంచి రసాన్ని పీల్చేయడం వల్ల నిమ్మకాయల మీద తెల్లమచ్చలు ఏర్పడుతాయి. దీనినే రైతులు పురుగునాకింది అని కూడా పిలుస్తారు. కాయ తొడిమ చుట్టూ మాడిపోయినట్లు కనిపిస్తుంది. కాయ పై భాగాన తెల్లని మచ్చలేర్పడి అమ్మకానికి పనికి రాకుండా పోతాయి.

నివారణ...

ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లు లేదా డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా స్పైనోశాడ్ 0.4 మిల్లీ లీటర్లు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు చిగురు దశలో పిచికారి చేయాలి.

పక్షికన్ను తెగులు..



క్లొల్‌లైటో ట్రెకమ్ గ్లియోస్పొరాయిడిస్ అనే శిలీంద్రం ద్వారా వస్తుంది. ఈ తెగులు ఆశించిన నిమ్మకాయలు ఎక్కువగా కోతకు రాక ముందే రాలిపోవడం గమనించవచ్చు. కాయలమీద మచ్చలు ఏర్పడుతాయి.

నివారణ: స్ట్రెప్టోసైక్లిన్ సల్ఫేట్ 1 గ్రాము+ హెక్సాకొనజోల్ 10 మిల్లీ లీటర్లకు 10 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలి.

జిల్లాకు 2,632 మెట్రిక్ టన్నుల యూరియా



రైల్వే వ్యాగన్ల నుంచి బయటకు దించుతున్న ఎరువును పరిశీలిస్తున్న ఏడీ, ఏఓ

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కుగాను యూరియా వచ్చినట్లు కడప ఏడీ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం 2632 మెట్రిక్ టన్నుల నీమ్ కోటెడ్ యూరియా కడప రైల్వేస్టేషన్‌లోని గూడ్స్‌షెడ్డుకు వచ్చినట్లు తెలిపారు. ఎరువును పరిశీలించిన అనంతరం ఏడీ మాట్లాడుతూ మొత్తం 2632 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని డీలర్లకు పంపుతున్నామని పేర్కొన్నారు. ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. గోడౌన్లలో కావలసినంత ఎరువులు ఉన్నాయన్నారు. ఈ ఎరువుల పరిశీలనలో కడప ఏఓ గంజికుంట రామకృష్ణ, నాగార్జున ఎరువుల కంపెనీ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువలో పడి వృద్ధుడు మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఖలీల్‌నగర్‌కు చెందిన బిగిలి నాగరాజు (60) అనే వృద్ధుడు శుక్రవారం తన ఇంటి వద్ద ఉన్న మురికి కాలువలో పడి మృతి చెందాడు. మద్యం సేవించే అలవాటు ఉందని, ఆ మత్తులో పడి ఉండవచ్చని బంధువులు తెలిపారు. ఎస్ఐ రుషేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి



ప్రమాదంలో మృతి చెందిన రైతు

ముద్దనూరు: ముద్దనూరు-పులివెందుల రహదారిలో మండలంలోని చిన్నదుద్యాల గ్రామ సమీపంలో గాలేరు-నగరి కాలువ వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి(60)అనే రైతు దుర్మరణం చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు రామకృష్ణారెడ్డి పశువుల మేతతో ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణారెడ్డిని గ్రామస్తులు వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

అమర రిమ్స్‌కాన్-2017 ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు (ఇన్‌సెట్) రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణంలో శుక్రవారం ఆంధ్ర మెడికోస్ ఆన్యువల్ రీసెర్చి అసెంబ్లీ (అమర) రిమ్స్‌కాన్-2017 ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభ సమయంలో కళాశాల ఆవరణానికి విచ్చేసిన రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలల విద్యార్థులు సదస్సుకు హాజరయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తర్వాత ఉదయం 9.00నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు వివిధ రకాల విభాగాలకు సంబంధించి వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈనెల 19వ తేదీన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా రిమ్స్‌కాన్-2017కు సంబంధించిన సదస్సును ప్రారంభిస్తారు. మూడవరోజు ఆదివారం డాక్టర్ వాసురెడ్డి, డాక్టర్ మునిచంద్రనాయుడు ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. సదస్సు చివరిరోజు విద్యార్థులకు వివిధ అంశాలపై జరిగిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సదస్సును 2కే12 బ్యాచ్ హౌస్ సర్జన్లు నిర్వహిస్తున్నారన్నారు.

బాల్య వివాహంపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లెలో నివసిస్తున్న నాగేశ్వర్ అనే వ్యక్తికి ఓ బాలిక (17)ను ఇచ్చి వివాహం చేసినట్లు, ఆ వివాహం చట్టవిరుద్ధమని ఐసీడీఎస్ అధికారి అరుణకుమారి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికను తల్లిదండ్రులే వివాహం చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఈనెల 12వ తేదీన తాము బృందంగా వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, అయితే సదరు బాలికలకు 16వ తేదీ నాగేశ్వర్ అనే వ్యక్తితో వివాహం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఆచూకీ కూడా తెలియాల్సి ఉంది. బాలిక తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

పేరు మట్కా.. కేసు గంజాయి

జమ్మలమడుగు: జిల్లాలో మట్కాబీటర్లపై పోలీసులు గంజాయి కేసులు పెడుతుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే జిల్లాలోని మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, దువ్వూరు మండలాల్లో చాలా మంది మట్కాబీటర్లను విచారణ పేరుతో స్టేషన్లకు పిలిపించి నేరుగా గంజాయి కేసులు పెడుతున్నారు. అసలు మట్కారాస్తున్న బీటర్లను వదిలేసి ఉన్నతాధికారులు చెప్పారంటూ నిరుపేదలను స్టేషన్‌కు తీసుకొచ్చి వారిచేత మట్కా రాస్తున్నమంటూ బలవంతంగా ఒప్పిస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారు.

ఎస్‌బీఐ నుంచి సమాచారం వచ్చిందని..

జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండలాల్లో గతంలో ఎవరైనా మట్కా నిర్వహించిన వారి పేర్లతోపాటు ప్రస్తుతం మట్కా నిర్వహిస్తున్న వారిని విచారణ పేరుతో స్టేషన్‌లకు పిలుచుకొస్తున్నారు. అయితే అందులో చాలా మంది తాము మట్కా రాయడంలేదని దాదాపు ఐదు, పది సంవత్సరాల నుంచి పనులు చేసుకుంటూ బతుకుతున్నామని చెబుతున్నా పోలీసులు మాత్రం తమకు ఎస్‌బీఐ అధికారుల నుంచి సమాచారం వచ్చింది కాబట్టి ఎటువంటి పరిస్థితుల్లో విడిచిపెట్టేది లేదంటూ పోలీసులు చెబుతున్నారు.



గంజాయి

మట్కా అరికట్టడం కోసం గంజాయికేసులా!

మట్కా నిర్మూలించేందుకు పోలీసుల గంజాయి కేసులు పెట్టడం సరైందా అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. నిజంగా మాట్కా రాస్తున్న వారిపై పోలీసు కేసులు పెట్టడంలేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. స్థానికంగా ఉన్న ఇంటలిజెన్సీలుగా వ్యవహరిస్తున్న పోలీసులు మట్కాబీటర్లతో సంబంధాలు నడపుకుంటూ వారితో లావాదేవీలను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు మట్కాకేసులపై నిఘా పెట్టాలని సూచించడంతో గతంలో మట్కారాసి మానేసిన వారిపేర్లు ఇస్తూ రాసే వారి పేర్లను చెప్పడం లేదని తెలుస్తోంది. ఇటీవల పోలీసులు పట్టుకున్న కేసులన్నీ ఇలాగే ఉన్నట్లు తెలిసింది. పోలీసులు అమాయకులపై గంజాయి కేసులు పెట్టి వేధించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహం


రిమ్స్ మార్చురీలో మృతదేహం

కడప అర్బన్ : నగర శివార్లలోని రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. గత నాలుగు రోజుల క్రితం రిమ్స్‌లో వెంకటేష్ అనే పేరుతో చేరి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. అనారోగ్యంతో అతడు శుక్రవారం మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిస్తే ఎవరైనా రావాలని, మృతదేహాన్ని అప్పగిస్తామని రిమ్స్ అధికారులు తెలిపారు.

కార్మికులను అక్రమంగా తొలగిస్తే ఊరుకోం

• ఎర్రబ్యాడ్జీలతో ఈయూ ఆందోళన


మాట్లాడుతున్న ఈయూ రీజనల్ సెక్రటరీ నారాయణ

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో అధికారులు కార్మికులను అక్రమంగా తొలగించడం అన్యాయమంటూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రబాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ కడప రీజనల్ సెక్రటరీ నారాయణ మాట్లాడుతూ కడప డిపో డ్రైవర్ యానాదయ్యకు మద్యం సేవించే అలవాటు లేదన్నారు. అలాంటి డ్రైవర్‌కు డ్యూటీకి వెళ్లే సమయంలో బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీ చేస్తే యానాదయ్యకు 6 శాతం వచ్చిందని, రెండవ సారి బ్రీత్ ఎనలైజర్ పెట్టమని కోరినా, మెడికల్ ఆఫీసర్ వద్ద నివేదిక తీసుకు వచ్చినా అధికారులు ఒప్పుకోకుండా అతన్ని తొలగించడం అన్యాయమన్నారు. ఇలాగే కొన్ని కేసుల్లో ప్రవర్తించారన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఏఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏడవ వేతన సవరణను అమలు చేయాలి


పోస్టల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పోస్టల్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏడవ వేతన సవరణను అమలు చేయాలని ఏఐజీఎస్‌యూ కడప డివిజన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట మూడవ రోజు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడవ వేతన సవరణ అమలు చేయకుండా కమలేష్ కమిటీ అందజేసిన రిపోర్టును కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకపోవడంతో పెరిగిన నిత్యావసర ధరలతో అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు సీపీఎస్ పెన్షన్ రూల్స్ ప్రకారం పెన్షన్ మంజూరు చేయాలన్నారు. డాక్ సేవక్ ఉద్యోగులకు 8 గంటల పని దినాలు కల్పించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం డాక్ సేవక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు రాము, కొండయ్య, బషీర్, పివిసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

రవి : నేనే రాజు నేనే మంత్రి
ప్రతాప్ : ఆనందోబ్రహ్మ
రాజా (రహత్) : లై
మురళి : జయ జానకి నాయక
సుధ : ఫిదా
తాహార్ : పార్టీషన్-1947
అమీర్ : అనబెల్



రమేష్ : నేనే రాజు నేనే మంత్రి
అప్సర : నిన్నుకోరి
ఎస్ఆర్ (సాయిబాబా) : లై

సీపీఎస్ రద్దుకు మిలియన్ మార్చ్

కడప ఎడ్యుకేషన్:


మిలియన్ మార్చ్ గోడపత్రికలను విడుదల చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానాన్ని ఏ తేదీన అయితే అమలు పరిచారో ఆరోజు అయిన సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రం నుంచి లక్ష గొంతుకల నినాదాల పేరుతో జరిగే 'మిలియన్ మార్చ్'కు ప్రతి సీపీఎస్ ఉద్యోగి తరలిరావాలని ఏపీసీపీఎస్ ,ఏపీజేఏసీ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ జనార్దన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, లెక్కల జమాల్‌రెడ్డిలు, కృష్ణప్రసాద్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం వారితోపాటు ఏపీ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ జీవీ నారాయణరెడ్డి ఇందుకు సంబంధించిన మిలియన్ మార్చ్ గోడపత్రికలను కడపలోని డీసీఈబీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌లు జీవీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు పెన్షన్ అనేది హక్కు అని భిక్ష కాదన్నారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని విజయవాడలో నిర్వహించే మిలియన్‌మార్చ్‌లో ప్రతి ఉద్యోగి పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ లెక్కల జమాల్

విజయవంతం చేయాలని ఏపీజేఏసీ పిలుపు

రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రజాప్రతినిధులందరికీ జీవితాంతం పింఛన్‌తో సహా సకల సౌకర్యాలు కల్పిస్తోందని, అయితే దాదాపు 30 సంవత్సరాలు పైగా ప్రజాసేవలో పనిచేసే ఉద్యోగులకు మాత్రం పెన్షన్ సౌకర్యం తొలగించడం ప్రభుత్వాల ద్వంద వైఖరిని తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, సీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రజనీకాంత్, కొండారెడ్డి, చెన్నారెడ్డి, రాజు, రాముడు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడి చదవాలి


మాట్లాడుతున్న రోబోకార్ట్ సంస్థ ప్రతినిధి వినీత్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రోబో కార్ట్ సంస్థ ప్రతినిధి పి.వినీత్ పేర్కొన్నారు. శుక్రవారం నగర శివార్లలోని కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు ఐసెన్స్ రోబోటిక్స్‌పై రెండు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఇటువంటి సదస్సులు ఎంతో అవసరమన్నారు. సదస్సుల ద్వారా సృజనాత్మకత మెరుగుపడుతుందన్నారు. కళాశాల చైర్మన్ కందుల శివానందరెడ్డి, సంస్థ సంచాలకులు మోహన్, కళాశాల సిబ్బంది శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని డిప్యూటీ ఈఓలు, మండల విద్యాశాఖాధికారులు వారి మండల పరిధిలో గ్యాస్ కనెక్షన్ లేని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందుబాటులో ఉన్న గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పొన్నతోట శైలజ తెలిపారు. పాఠశాల యూడైస్‌కోడ్, ఎస్‌ఎంసీ బ్యాంకు అకౌంట్‌బుక్‌తో తక్షణం గ్యాస్ కనెక్షన్ పొందాలన్నారు. అందుకు అవసరమైన మొత్తాన్ని సంబంధిత ఎస్ఎస్ఏ/ఆర్ఎంఎస్ఏ గ్రాంట్ నుంచి ఉపయోగించుకోవాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్‌ను తీసుకోని ప్రధానోపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని డీఈఓ హెచ్చరించారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రెండవ రోజూ నిరాహార దీక్షలు

కడప అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీలో అధికారులు కార్మిక వ్యతిరేక విధానాలను పాటిస్తున్నారని, వాటిని అరికట్టే దిశగా జరుపుతున్న నిరాహార దీక్షలు శుక్రవారం రెండవరోజుకు చేరుకున్నాయి. కార్యక్రమానికి విచ్చేసిన ఎన్ఎంయూ కడప డిపో గౌరవాధ్యక్షుడు ఏటూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో అధికారులు కార్మికులపట్ల నిరంకుశ ధోరణిని అవలంబిస్తున్నారన్నారు. పని భారం పెరగడంతో కార్మికులు విశ్రాంతి లేకుండా బస్సులను నడుపుతూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆదాయం కోసం అహర్నిశలు పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీక్షల్లో ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి శివారెడ్డి, రీజనల్ కారదర్శి సుధాకర్, డిపో కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎంయూ గౌరవాధ్యక్షుడు ఏటూరి రామచంద్రారెడ్డి

21న కలెక్టరేట్ వద్ద ఆందోళన



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 21న వ్యవసాయ కూలీల సమస్యలపై నూతన కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరుస కరువుతో ప్రజలు అవస్థలు పడుతూ పనులు లేక కూలీలు వలసలు వెళుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు రెండు లేదా మూడు నెలలు అయినా కూలి డబ్బులు ఇంతవరకూ అందలేదన్నారు. దాదాపు రాష్ట్రంలో రూ. 35 కోట్లు బకాయి ఉందని, త్వరగా కేంద్రం నుంచి నిధులు తెప్పించి కూలీలకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. కాశినాయన, రాయచోటి, రైల్వేకోడూరు, జమ్మలమడుగు ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వం భూమిని అధికార పార్టీ నేతలు కబ్జాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ వ్యవహారాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రిపై ఉందన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములను కొందరు అగ్రవర్ణాల వారు దౌర్జన్యాలకు పాల్పడుతూ ఆక్రమించుకోవాలని చూడటం దారుణమన్నారు. కరువుతో రైతులు, ప్రజలు ఆగచాట్లు పడుతుంటే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పనులు లేవని, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మికులు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పులి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలి

కడప అగ్రికల్చర్ : జీవన ఎరువులను రైతులు వినియోగించుకునేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని ఊటుకూరు ఏరువాక కేంద్రం ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ అంకయ్య కుమార్ గౌడ్ సూచించారు. శుక్రవారం ఊటుకూరులోని ఏఆర్ఎస్‌లో కడప వ్యవసాయ డివిజన్‌లోని మండల అధికారులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకయ్య కుమార్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో జీవన ఎరువుల వినియోగం తక్కువగా ఉందని ఇలాంటి తరుణంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి వివరించాలన్నారు. జీవన ఎరువులను రైతులు విత్తనశుద్ధిగాను, ఎరువులతో కలిపి వేసుకోవడం వలన పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కడప ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి కరుణాసాగర్, శాస్త్రవేత్త శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా | శనివారం | ఆగస్టు | 19 | 2017

Portal Updates:
www.sakshieducation.com
- ANU: LL.B. (3 & 5 Years) April 2017 Regular Exam Results
- Executive PG Programme in Management 2018 at IIM Bangalore
- IBPS PO/MT 2017 Prelims Material, Online Practice Tests

విద్య
శ్రద్ధావాన్ లభతే జ్ఞానం

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to..sakshieducation@gmail.com

సీబీఎఫ్‌సీ నూతన చైర్మన్‌గా నియమితులైందెవరు?


ఎన్. విజయేందర్‌రెడ్డి
సబ్జెక్టు నిపుణులు,
హైదరాబాద్.



జనరల్ స్టడీస్ జీకే & కరెంట్ అఫైర్స్ ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ నూతన అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు? (ఆయన 2017 సెప్టెంబర్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు)
   1) మిరోస్లావ్ లాజ్ కాక్ (స్లొవేకియా)
   2) జాన్ కానన్ (చెక్ రిపబ్లిక్)
   3) హారీ హోల్కేరీ (ఫిన్లాండ్)
   4) రజాలీ ఇస్మాయిల్ (మలేసియా)
2. 2017 ఆగస్టు 11న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) నూతన చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) నరేంద్ర కోహ్లీ 2) ప్రసూన్ జోషి
   3) శ్యాం బెనగల్ 4) వివేక్ అగ్నిహోత్రి
3. 2017 జూన్‌లో ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఎవరు నియమితులయ్యారు?
   1) రాజీవ్ సింగ్ 2) సునీల్ అలఘ్
   3) శశిశేఖర్ వెంపటి
   4) అశోక్ కుమార్ టాండన్
4. 2017 జూన్ 2న నిర్వహించిన సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌కు అతిథి దేశంగా కింది వాటిలో దేన్ని ఆహ్వానించారు?
   1) అమెరికా 2) జపాన్
   3) భారత్ 4) సింగపూర్
5. 2017 జూలై 1న టెడ్రోస్ అధనోమ్ గెబ్రేసస్ ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఏ దేశానికి చెందినవారు?
   1) నైజీరియా 2) ఇథియోపియా
   3) ఈజిప్ట్ 4) అల్జీరియా
6. 2017 మేలో ఫోర్బ్స్ మేగజైన్ విడుదల చేసిన టాప్ టెన్ గ్లోబల్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల జాబితాలో స్థానం దక్కించుకున్న ఏకైక భారతీయ కంపెనీ ఏది?
   1) రిలయన్స్ కేపిటల్
   2) ఇండియా బుల్స్ 3) హెచ్‌డీఎఫ్‌సీ
   4) బజాజ్ కేపిటల్
7. ఫోర్బ్స్ టాప్‌టెన్ గ్లోబల్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్న కంపెనీ?
   1) అమెరికన్ ఎక్స్‌ప్రెస్
   2) వీసా 3) మాస్టర్ కార్డ్
   4) కేపిటల్ వన్ ఫైనాన్షియల్
8. భారత్‌లో అత్యంత పొడవైన ధోలా-సాదియా వంతెనను (9.15 కి.మీ.) ఏ నదిపై నిర్మించారు?
   1) గంగ 2) గోదావరి
   3) నర్మద 4) బ్రహ్మపుత్ర
9. ఏటా ఏప్రిల్ 24వ తేదీని ఏ దినంగా నిర్వహిస్తారు?
   1) జాతీయ బాలికా శిశు దినోత్సవం
   2) సివిల్ సర్వీసెస్ దినోత్సవం
   3) జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
   4) జాతీయ సాంకేతిక దినోత్సవం
10. 2017 మేలో 'డేన్ డేవిడ్ పురస్కారం' ఏ భారతీయ శాస్త్రవేత్తకు లభించింది?
    1) శ్రీనివాస్ కులకర్ణి
    2) సందీప్ చక్రబర్తి
    3) సోమ్‌నాథ్ భరద్వాజ్
    4) తను పద్మనాభన్
11. 2017 మేలో ఇరాన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎవరు ఎన్నికయ్యారు?
    1) ఇబ్రహీం రైసీ 2) అహ్మదీ నెజాద్
    3) హసన్ రౌహానీ 4) అబ్దుల్ హమీద్
12. ఐక్యరాజ్యసమితి 2011-2020 దశాబ్దాన్ని ఏ విధంగా గుర్తించింది?
    1) అక్షరాస్యత దశాబ్ది
    2) జీవ వైవిధ్య దశాబ్ది
    3) పేదరిక నిర్మూలన దశాబ్ది
    4) నిరాయుధీకరణ దశాబ్ది
13. కేవలం ఐదు రోజుల వ్యవధిలో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని రెండుసార్లు అధిరోహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించిన పర్వతారోహకురాలు ఎవరు?
    1) అరుణిమా సిన్హా 2) బచేంద్రి పాల్
    3) సంతోష్ యాదవ్ 4) అన్షు జంసేన్‌పా
14. 2017 మేలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించిన గణాంకాల ప్రకారం ఆదాయ వృద్ధిరేటులో అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్రం?
    1) గుజరాత్ 2) పశ్చిమబెంగాల్
    3) ఆంధ్రప్రదేశ్ 4) తెలంగాణ
15. 44వ జీ 7 సదస్సును 2018లో ఏ దేశంలో నిర్వహిస్తారు?
    1) ఫ్రాన్స్ 2) జర్మనీ
    3) కెనడా 4) జపాన్
16. సూపర్ కాప్‌గా పేరొందిన కేపీఎస్ గిల్ ఇటీవల మరణించారు. ఆయన ఏ రాష్ట్ర మాజీ డీజీపీ?
    1) రాజస్థాన్ 2) జమ్ము-కశ్మీర్
    3) హరియాణా 4) పంజాబ్
17. అమెరికాలో అప్పీళ్ల కోర్టు న్యాయమూర్తిగా ఇటీవల నియమితుడైన భారతీయ అమెరికన్ ఎవరు?
    1) రో ఖన్నా 2) రాజా కృష్ణమూర్తి
    3) అమూల్ థాపర్
    4) వివేక్ మూర్తి
18. హిందూ మహాసముద్రంలో చాగోస్ దీవులపై ఏ రెండు దేశాల మధ్య దీర్ఘకాలికంగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది?
    1) చైనా, జపాన్
    2) మాల్దీవులు, ఫ్రాన్స్
    3) శ్రీలంక, ఫ్రాన్స్ 4) మారిషస్, యూకే
19. 2017 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో అత్యంత లాభదాయక ప్రభుత్వ రంగ సంస్థ ఏది?
    1) ఐఓసీ 2) ఓఎన్‌జీసీ
    3) హెచ్‌పీసీఎల్ 4) బీపీసీఎల్
20. 2016-17లో ప్రైవేట్ రంగ కంపెనీల్లో అత్యధిక లాభదాయక కంపెనీ ఏది?
    1) టీసీఎస్ 2) రిలయన్స్ ఇండస్ట్రీస్
    3) విప్రో 4) ఇన్ఫోసిస్
21. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం తొలి మహిళా చాన్స్‌లర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
    1) సునయన సింగ్ 2) మీరా కుమార్
    3) నజ్మా హెప్తుల్లా 4) మీనాక్షి లేఖి
22. జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
    1) రాంశంకర్ కథేరియా
    2) ఎల్. మురుగన్ 3) కె. రాములు
    4) యోగేంద్ర పాశ్వాన్
23. మరియానో రజోయ్ ఏ దేశ ప్రధాని?
    1) ఫ్రాన్స్ 2) ఇటలీ
    3) స్పెయిన్ 4) ఇజ్రాయెల్
24. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఏ హైకోర్టు సూచించింది?
    1) కేరళ హైకోర్టు
    2) అలహాబాద్ హైకోర్టు
    3) గుజరాత్ హైకోర్టు
    4) రాజస్థాన్ హైకోర్టు
25. 70వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్టాత్మక 'పామ్ డీ ఓర్' పురస్కారాన్ని 'ది స్క్వేర్' చిత్రం గెలుచుకుంది. ఈ సినిమా ఏ దేశానికి చెందింది?
    1) ఇరాన్ 2) దక్షిణ కొరియా
    3) స్వీడన్ 4) పోలాండ్
26. 2016-17లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఎంత శాతంగా నమోదైంది?
    1) 7.1 2) 7.5
    3) 8.1 4) 8.2
27. 2017 జూన్ 1న పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన దేశం ఏది?
    1) చైనా 2) అమెరికా
    3) జర్మనీ 4) మెక్సికో
28. తమిళనాడులో కుడంకుళం అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని 5, 6 యూనిట్ల నిర్మాణానికి ఇటీవల ఏ దేశం అంగీకరించింది?
    1) ఫ్రాన్స్ 2) యూకే
    3) జపాన్ 4) రష్యా
29. ఏ దేశ ప్రధాని అధికార నివాస భవనాన్ని 'మంకోలా ప్యాలెస్' అని పిలుస్తారు?
    1) కెనడా 2) అర్జెంటీనా
    3) ఐస్‌లాండ్ 4) స్పెయిన్
30. 2017 జూన్ 1న 18వ భారత్ – రష్యా వార్షిక సదస్సును రష్యాలోని ఏ నగరంలో నిర్వహించారు?
    1) మాస్కో 2) వ్లాదివోస్తాక్
    3) సెయింట్ పీటర్స్‌బర్గ్
    4) ఎకాతెరిన్‌బర్గ్
31. 2018 డిసెంబర్‌లో ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పు సదస్సును ఏ దేశంలో నిర్వహిస్తారు?
    1) పోలాండ్ 2) దక్షిణాఫ్రికా
    3) కొలంబియా 4) పెరూ
32. అమెరికాలో నిర్వహించిన 2017 స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్‌బీ పోటీల్లో విజేతగా నిలిచిన భారత సంతతికి చెందిన బాలిక?
    1) శ్రీనిధి గోపాల్ 2) అనన్య వినయ్
    3) కావ్య శివశంకర్
    4) మీరా దెథియా
33. 2017 మేలో మాస్కో గ్రాండ్ ప్రి చెస్ టోర్నమెంట్‌ను గెలుచుకున్న క్రీడాకారుడెవరు?
    1) పెంటేల హరికృష్ణ (భారత్)
    2) పీటర్ స్విడ్లర్ (రష్యా)
    3) అనీష్ గిరి (నెదర్లాండ్స్)
    4) డింగ్ లీరెన్ (చైనా)
34. 2017 ఫెడరేషన్ కప్ ఫుట్‌బాల్ టైటిల్‌ను ఏ జట్టు గెలుచుకుంది?
    1) బెంగళూరు ఎఫ్‌సీ
    2) మోహన్ బాగాన్
    3) చర్చిల్ బ్రదర్స్ 4) చెన్నై సిటీ
35. 2017 మేలో నాలుగు దేశాల వన్డే టోర్నీలో ఏ దేశ మహిళా క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది?
    1) దక్షిణాఫ్రికా 2) ఇంగ్లండ్
    3) భారత్ 4) ఆస్ట్రేలియా
36. 2017 సంవత్సరానికి 'సియట్ ఇంటర్నేషనల్ క్రికెట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్న భారత క్రీడాకారుడెవరు?
    1) విరాట్ కోహ్లీ
    2) రవిచంద్రన్ అశ్విన్
    3) రవీంద్ర జడేజా 4) చెతేశ్వర్ పుజార
37. 2017 మేలో మాల్దీవుల్లో నిర్వహించిన దక్షిణాసియా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన జట్టు?
    1) నేపాల్ 2) భారత్
    3) బంగ్లాదేశ్ 4) శ్రీలంక
38. 2017 మేలో మొనాకో గ్రాండ్ ప్రి ఫార్ములా వన్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు?
    1) సెబాస్టియన్ వెటెల్
    2) కిమీ రైకోనెన్
    3) లూయిస్ హామిల్టన్
    4) నికో రోస్‌బర్గ్
39. 2017 సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ విజేత?
    1) చైనా 2) ఇండోనేసియా
    3) దక్షిణ కొరియా 4) భారత్
40. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన పృథ్వీ-2 క్షిపణిని ఇటీవల భారత సైన్యం విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి ఎన్ని కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు?
    1) 350 కి.మీ. 2) 500 కి.మీ.
    3) 700 కి.మీ. 4) 290 కి.మీ.

సమాధానాలు

1) 1	2) 2	3) 3	4) 3	5) 2
6) 3	7) 1	8) 4	9) 3	10) 1
11) 3	12) 2	13) 4	14) 4	15) 3
16) 4	17) 3	18) 4	19) 1	20) 2
21) 3	22) 1	23) 3	24) 4	25) 3
26) 1	27) 2	28) 4	29) 4	30) 3
31) 1	32) 2	33) 4	34) 1	35) 3
36) 2	37) 2	38) 1	39) 3	40) 1

స్వతంత్ర భారత తొలి మంత్రి వర్గం

ఇటీవల భారత్ 71వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకొంది. ఈ సందర్భంగా స్వతంత్ర భారత్‌లో తొలి కేబినెట్ మంత్రులు, వారు నిర్వహించిన శాఖలను పరిశీలిద్దాం.

1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా 14 మందితో కూడిన కేబినెట్ ఏర్పడింది.

జవహర్ లాల్ నెహ్రూ: ప్రధానమంత్రి, విదేశీ వ్యవహారాలు, కామన్వెల్త్ వ్యవహారాలు, శాస్త్రీయ పరిశోధన
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్: ఉపప్రధాని, హోం, సమాచార ప్రసార శాఖ, రాష్ట్రాలు
రాజేంద్రప్రసాద్: ఆహారం, వ్యవసాయ శాఖ
మౌలానా అబుల్ కలాం ఆజాద్: విద్యాశాఖ
జాన్ మతాయ్: రైల్వే, రవాణా శాఖ
సర్దార్ బల్దేవ్ సింగ్: రక్షణ శాఖ
జగ్జీవన్ రామ్: కార్మిక శాఖ
సి.హెచ్. బాబా – వాణిజ్యం
రఫీ అహ్మద్ కిద్వాయ్: కమ్యూనికేషన్స్
రాజ్‌కుమారి అమృత్ కౌర్: ఆరోగ్యం
బి.ఆర్. అంబేడ్కర్: న్యాయశాఖ
ఆర్.కె. షణ్ముఖం చెట్టి: ఆర్థిక శాఖ
శ్యామప్రసాద్ ముఖర్జీ: పరిశ్రమలు
ఎన్.వి. గాడ్గిల్: గనులు, ఇంధనం

వైఎస్సార్ జిల్లా | శనివారం | ఆగస్టు | 19 | 2017 సాక్షి

The synonym of Evidence is:

K. Lalitha Bai
Subject Expert

MODEL QUESTIONS

Directions (Q.No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake /error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The arbitrary manner in which the Radcliffe Award drew up (1)/ the border lead to confusion and chaos (2)/ in determining what would be India (3)/ and what would be Pakistan. (4)/ No error (5)

2. The Central government has asked all firms to sell (1)/ Smartphone handsets in the country to share details of the processes they follow (2)/ to ensure there is no possibility (3)/ of data thefts or leakages from their devices. (4)/ No error (5)

3. The students of Tamil Nadu feel that the recent ordinance of the State government (1)/ to exempt Tamil Nadu from NEET this year (2)/ was merely political bargaining chip (3)/ which would affect the lives and careers. (4)/ No error (5)

4. The most frightening aspect of malnutrition (1)/ is that it was likely (2)/ to cause permanent damage (3)/ to the brain. (4)/ No error (5)

5. This summary highlight (1)/ some information (2)/ already included (3)/ in the prospectus. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Five minutes from the Golden Temple, the Town Hall now houses the memories and history of the life and times that scarred two nations as they were born.

B) In the massively disruptive event that was the splitting of India and Pakistan in 1947.

C) August 17, 2017, is when the Museum begins its formal existence, for it is 70 years to the date that the process of partition was announced in 1947, rendering millions homeless and nationless overnight.

D) A strange amnesia and loss and lack of memory appear to be partly addressed by the Partition Museum, now formally open in Amritsar.

E) The trauma has diminished in memory for newer generations of Indians and Pakistanis even as it continues to be a life changing, nightmare inducing thought for those who lived through it.

F) Eighteen million lives were disrupted, people died, women were raped, plundered, displaced, and in many cases, dehumanized.

6. What is the FIRST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

7. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

8. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

9. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

10. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ____ of the museum have now received ____documents.
1) curators, ample
2) caretakers, deficit
3) warden, surplus
4) steward, additional
5) guardian, extra

12. A parade of prominent Republicans and US ally Britain also ____ Trump, leaving him increasingly ____after his comments on Tuesday.
1) censure; remote
2) chided; lonely
3) scolded; inaccessible
4) reproach; secluded
5) rebuked; isolated

13. He would face ____ action for ____ in anti-party activities if he goes ahead with his protest.
1) stern, inviting
2) disciplinary; indulging
3) rigorous; propagating
4) violent; performing
5) necessary; getting

14. The Indian Medical Association has sent a three-member team to ____the BRD hospital ____and submit a report.
1) probe; irregularity
2) examine; victims
3) investigate; fatalities
4) inspect; loss
5) study; wounds

15. The speaker ____ his presentation by narrating jokes.



BANK
POs, Clerks
Special
English Language

1) invigorated 2) vitalized
3) fatigued 4) exhausted
5) delivered

Directions (Q.No. 16 - 20) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Given the widespread acceptance of the image of the ocean depths as **serene** and undisturbed, it is surprising that researchers initially greeted the **evidence** for powerful deep-sea storms and dynamic currents with disbelief. The earliest arguments in support of the **existence** of such powerful deep-sea currents were based on models of ocean circulation derived from hydrodynamic theory. Because the density of cold water is greater than that of warm water, cold water tends to sink. Thus, near the poles, the chilly water sinks, in theory, this sinking should create powerful, regular deep-sea currents flowing from the poles toward the warm equatorial regions.

16. The topic narrated in the passage is about ____
1) Ocean circulation
2) Corroboration
3) Deep sea currents
4) Theory of dynamics
5) Oceanography

17. Which statement is true according to the passage?
a) Deep-sea storms and dynamic currents came as a rude shock to the researchers.
b) Earlier arguments in support were ruled out.
1) Only a 2) Only b
3) Both a & b 4) Neither a nor b
5) Either a or b

18. The synonym of Evidence is:
1) Induction 2) Seduction
3) Procrastination 4) Stimulation 5) Confirmation

19. The antonym of Serene is:
1) Bustling 2) Tranquil
3) Pristine 4) Immaculate
5) Content

20. The antonym of Existence is:
1) Reality 2) Survival
3) Continuation
4) Extinction 5) Fossil

Directions: (Q.No. 21- 25) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. Devotees of Salman <u>Rushdie's maintained that his writing has</u> all the qualities found in the highest order of Indian writers.
1) Rushdie's maintained that his writing have
2) Rushdie's maintained that his writing had
3) Rushdie maintained that his writing has
4) Rushdie maintained that his writing had
5) No correction required

22. Drinking milk enriched with vitamin D may significantly <u>reduce the risk of rickets and also aid for</u> sufferers of heart disease.
1) reduce risk of rickets and aid for
2) reduces the risk of rickets and also aid for
3) reduce the risk of rickets and aid
4) reduce the risk of rickets and aid for
5) No correction required

23. Many of these environmentalists proclaim <u>to save nothing less than</u> the planet itself.
1) to save nothing lesser than
2) that they are saving nothing lesser than
3) to save nothing less
4) that they save nothing less than
5) No correction required

24. Generally, in the fine print of insurance documents <u>lies the clauses that make a fool</u> out of the gullible consumer.
1) lies the clause that make a fool
2) lie the clauses that makes a fool
3) lie the clauses that make a fool
4) lies the clauses that makes fools
5) No correction required

25. The expedition did not enter the Himalayas because it believed that <u>to do it endangers</u> the team and might cause fatal injuries.
1) doing so would endanger
2) to do it is endangering
3) doing is endanger
4) doing it endangers
5) No correction required

Directions (Q.No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The Union Cabinet has ___ (26) a new policy for expanding and___ (27) metro rail services in cities across India. This is the first such policy document ____(28) by the Centre ___ (29) metro rail operations began in Delhi in 2002. The 14-page document approved on Wednesday has seven key points, of which the ___ (30) significant is the one on funding pattern. The policy gives a ___(31) boost to private players by making private participation __(32) for all the three funding options - be it a public-private partnership (PPP) model with central ___(33) under the Viability Gap Funding scheme of the Finance Ministry, a grant ___(34) the Centre under which 10% of the project cost would be given as a lump sum, or a 50:50 ___(35) sharing model between the Central and State governments.

26. 1) approved 2) accepted
3) standard 4) agreed
5) official

27. 1) adapting 2) regulating
3) flexible 4) variable
5) changing

28. 1) prepared 2) arranged
3) equipped 4) organized
5) ready

29. 1) while 2) for 3) as
4) since 5) from

30. 1) many 2) most 3) much
4) very 5) all

29. 1) robust 2) tough 3) big
4) strong 5) healthy

32. 1) binding 2) enforced
3) forced 4) compelling
5) mandatory

33. 1) assurance 2) supervision
3) prejudice 4) assistance
5) forceful


34. 1) of 2) for 3) with
4) from 5) since

35. 1) partner 2) equity
3) associate 4) pair
5) just

KEY

1) 2	2) 1	3) 3	4) 2	5) 1
6) 4	7) 2	8) 4	9) 1	10) 3
11) 1	12) 5	13) 2	14) 3	15) 1
16) 3	17) 1	18) 5	19) 1	20) 4
21) 4	22) 3	23) 4	24) 3	25) 1
26) 1	27) 2	28) 1	29) 4	30) 2
31) 3	32) 5	33) 4	34) 4	35) 2


ఈ రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





ఇక్కడ వస్తున్న వ్యక్తి పౌండ్ నుండి బయటకు వచ్చే దారి చూపండి.

కింద ఇచ్చిన బొమ్మను రెండవ భాగం పూరించండి.



నాన్నా చెప్పవా?

శనిగ్రహపు వలయాలు ఎంత మందంగా ఉంటాయి?



మన సౌరమండలంలో భూమి తరువాత చాలా అందంగా కనిపించే గ్రహం శనిగ్రహమని కొందరు అంటుంటారు. ఈ గ్రహపు అందమంతా దీని వలయాల్లోనే ఉంది అనడంలో సందేహం లేదు. సౌరమండలంలో రెండవ అతి పెద్ద గ్రహమైన శని సూర్యుడి నుంచి సుమారు 887 కోట్ల మైళ్ల దూరంలో ఉంది. ఇది సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తిచేయడానికి 291/2 సంవత్సరాల సమయం తీసుకుంటుంది. ఈ గ్రహపు వ్యాసం74,000 మైళ్లు. అది మన భూమి వ్యాసంకన్నా 9 రెట్లు ఎక్కువ. 95 భూగోళాల ద్రవ్యరాశితో ఉండే ఈ మహా గ్రహానికి సైజుకి తగినట్లుగానే 60కి పైగా ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. శని గ్రహం చుట్టూ ఈ ఉపగ్రహాలేగాక ... ఓ చిన్న గులకరాయి సైజు మొదలుకొని ఓ పెద్ద ఇల్లంత సైజు దాకా ఉండే లక్షలాది శకలాలు కూడా పరిభ్రమిస్తూ ఉన్నాయి. గిర గిరా తిరుగుతూ ఉండే ఈ శకలాలన్నీ కలసి మనకు అందమైన వలయాల్లాగా కనిపిస్తుంటాయి. శని గ్రహం చుట్టూ కనిపించే ఈ వలయాల్లోని ఖగోళ శకలాలు అడ్డంగా 1,70,500 మైళ్లదాకా వ్యాపించి ఉంటే, నిలువుగా కేవలం 10 మైళ్ల మందంతో మాత్రమే ఉన్నాయి. గతంలో ఎన్నడో శని గ్రహానికి చెందిన ఉపగ్రహాల్లో రెండు గాని, లేదాఅంతకన్నా ఎక్కువగాని పరస్పరం ఢీ కొట్టుకోవడం వల్ల ఈ శకలాలు రూపొంది ఉండవచ్చని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

మీకు తెలుసా?



ఢాకా నగరంలో చదరపు కిలోమీటర్‌కు 44,500 జనసాంద్రత ఉంటుంది. ఈ భూమిపై అత్యంత రద్దీగా ఉండే నగరం ఢాకా



ఈజిప్టుకన్నా సూడాన్‌లో ఎక్కువ పిరమిడ్‌లు ఉన్నాయి



ఆస్తిని కాపాడుకోవడంకోసం ఎవరినైనా చంపడానికి టెక్సాస్‌లో చట్టం అనుమతిస్తుంది

గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పక్కన ఇచ్చిన గళ్లలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.


root	k	r	l	i	z	a	r	d	z
hike	r	n	e	k	c	i	h	c	g
nail	e	d	q	a	h	i	z	z	n
lizard	k	a	x	e	s	z	k	d	o
donkey	c	x	m	e	c	t	n	o	y
crayon	a	s	s	k	a	o	a	n	a
chicken	r	r	u	i	n	o	i	k	r
cracker	c	e	w	h	w	r	l	e	c
	k	f	o	r	x	q	u	y	d

దారి చూపండి

క్యారట్ లోపలి నుంచి గేటు బయటికి రావడానికి అక్కడ ఉన్న మూడు దారుల్లో నుండి ఏ దారిలో రావాలో దారి చూపండి.



అంకెలు కలపండి.. రంగులు వేయండి



వైఎస్‌ఆర్ జిల్లా | శనివారం | ఆగస్టు | 19 | 2017 సాక్షి

నేడు ముఖ్యమంత్రి రాక

కడప సెవెన్‌రోడ్స్ : కర్నూలుజిల్లాలో పర్యటించేందుకు వెళుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం 9.25 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ బాబూరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 గంటలకు ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడికి చేరుకుంటారన్నారు. 9.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నంద్యాలకు వెళతారన్నారు. నంద్యాలలో రాత్రి బస చేసి ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు అయ్యలూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.00 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారన్నారు. 2.10 గంటలకు కడప విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని కలెక్టర్ వివరించారు.

హజ్ యాత్రికునికి సత్కారం



సయ్యద్‌షా హుసేనీభాష షహమీరి సాహెబ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని మజ్జిద్-యే-బుఖారియాలో శుక్రవారం హజ్ యాత్రికుడిని సత్కరించారు. అస్థానె షహమీరియా పీఠాధిపతి సయ్యద్‌షా హుసేనీభాష షహమీరి సాహెబ్ పవిత్ర హజ్ యాత్రకు శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి ఆధ్వర్యంలో సత్కరించారు. హజ్ యాత్ర విజయవంతం కావాలని, ప్రపంచశాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ మహమ్మద్ బుఖారి, హబీబ్ బుఖారి, అజుజుల్లా బుఖారి, రహత్ పీరా, యూసుఫ్ బుఖారి,నాజమ్‌బాష బుఖారి, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

కావ్య ఆవిష్కరణ సభ వాయిదా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఈనెల 20న నిర్వహించదలచిన 'స్వాతంత్య్ర సమరయోధుడు టిప్పు' కావ్య ఆవిష్కరణ సభను వాయిదా పడింది. ఈ విషయాన్ని నవ్య సాహితీ సమితి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావ్య రచయిత ఏసీ దస్తగిరి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

సుందరం గాజుల అలంకారం



ప్రొద్దుటూరు కల్చరల్: శ్రావణ మాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక విజయనగరం వీధిలోని శ్రీచౌడేశ్వరిదేవిని గాజులతో అలంకరించారు. వేకువజామున విశేష అభిషేకాలు నిర్వహించారు. వివిధరకాల మట్టి గాజులతో తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపారు.

20న అండర్-14 క్రికెట్‌జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 20వ తేదీన ఉదయం 8 గంటలకు అండర్-14 జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. రామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్‌తో పాటు స్టడీ కమ్ డేటాఫ్‌బర్త్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు. 2003 సెప్టెంబర్ 1 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 17 నుంచి ఒంగోలు, పేరిచర్ల, నరసరావుపేటలలో నిర్వహించే అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కావున క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోచ్ కావాలంటే..
కొత్తగూడెం వెళ్లాల్సిందే..!

- ఏపీలో కోచ్‌లకు తెలంగాణలో ఇంటర్వ్యూలు
- ఇదేమి చోద్యం అంటున్న క్రీడాకారులు
- నేడు, రేపు ఎంపికలు



శిక్షణ ఇస్తున్న కోచ్ (ఫైల్)

కడప స్పోర్ట్స్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కోచ్ కావాలంటే తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం వెళ్లాల్సిందే. దీంతో క్రీడాకారులు ఇదేమి విచిత్రమంటూ కొందరు విరమించుకోగా.. మరికొందరు క్రీడాకారులు, కోచ్‌లు పొట్టకూటికోసం ఎక్కడికైనా వెళ్లాల్సిందేనని బయలుదేరారు. వివరాల్లోకి వెళితే.. ఈఏడాది ఏప్రిల్ లో శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 కోచ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులు, ఎన్‌ఐఎస్ శిక్షణ పూర్తి చేసినవారు అర్హులంటూ పేర్కొన్నారు. వీరందరికీ వారి క్రీడాంశాల ఆధారంగా మే మూడోవారంలో విజయవాడలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఎంపికల వ్యవహారం కాస్తా హోటళ్లు, లాడ్జీలలో నిర్వహించడంతో అభాసుపాలైంది. దీంతో ఇంటర్వ్యూలు పూర్తయి రెండు నెలలైనా ఫలితాలు విడుదల చేయకపోవడంతో క్రీడాకారులు/కోచ్‌లు నిరాశకు గురయ్యారు. ఉన్నట్టుండి ఆ ఫలితాలు పక్కన పెట్టి కోచ్‌ల నియామక ప్రక్రియ ఓ ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పజెప్పారు. అది కూడా పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన సంస్థకు అప్పజెప్పారు. ఒక్కో కోచ్‌కు రూ.18వేల వేతనం ఇవ్వనున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని 19, 20వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేపట్టనున్నట్లు సదరు అవుట్‌సోర్సింగ్ సంస్థ పత్రికా ప్రకటన ఇచ్చింది. దీంతో ఎంపికల కోసం గతంలో విజయవాడ చుట్టూ తిరిగి క్రీడాకారులు మళ్లీ కొత్తగూడెం బయలుదేరారు. క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే క్రీడాకారులను తయారుచేసే కోచ్‌ల నియామకంలో ఇలా వ్యవహరించడం తగదని.. శాప్ ఆధ్వర్యంలోనే నేరుగా ఎంపికలు నిర్వహించి పారదర్శకంగా చేపట్టి ఉంటే బాగుండేదని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇచ్చాం..

గతంలో కోచ్‌లుగా దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇచ్చాం. ప్రైవేట్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కోచ్‌ల నియామకాలు చేపట్టనున్నట్లు శాప్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీనికి సంబంధించి కోచ్‌ల వివరాలను కూడా పంపించాం. – ఎం.ఎస్. ఉమాశంకర్, డీఎస్‌డీఓ, కడప

బేస్‌బాల్ క్రీడను విస్తరించాలి



ఆటను ప్రారంభిస్తున్న ఉమాశంకర్

జమ్మలమడుగు: బేస్‌బాల్ క్రీడను క్రికెట్‌లా విస్తరింపచేసేలా కృషి చేయాలని జిల్లా క్రీడాసాధికార సంస్థ పరిశీలకుడు ఎంఎస్ ఉమాశంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పతంగే రామన్నరావు క్రీడాప్రాంగణంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్‌పోటీలను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మైలవరం జడ్పీటీసీ సుబ్బరామిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు క్రీడా మైదానంలో శాప్ క్రీడా వికాస కేంద్రం ఆరునెలల్లో రాబోతుందన్నారు. దీని ద్వారా ఇండోర్ స్టేడియంస్టేడియంలో పలు పోటీలు జరుగుతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో బేస్‌బాల్ క్రీడకు కూడా మంచి గుర్తింపు వస్తుందన్నారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జడ్పీటీసీ సుబ్బరామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు వివిధ ప్రాంతాలనుంచి రావడం వల్ల వారికి కొత్త పరిచయాలతోపాటు, ఆ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయలతో పాటు , వారి పద్ధతులు కూడా తెలుస్తాయన్నారు. గెలుపు కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎర్రన్న, సత్యప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సజ్జనరావు, కార్యదర్శి నవీన్‌కుమార్, పీఆర్ పీఈటీ ప్రదీప్ ,మునయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా
ఓ మోస్తరు వర్షం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా జిల్లాలో మూడు రోజులుగా చిరుజల్లులతో ప్రారంభమై ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో సరాసరి 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కడప 11.2 మి.మీ, వల్లూరు 3.8, పెండ్లిమర్రి 2.6, చింతకొమ్మదిన్నె 3.2, చెన్నూరు 8.4, ఖాజీపేట 7.0, కమలాపురం 9.0, ఎర్రగుంట్ల 6.0, వీరపునాయునిపల్లె 3.2, రాయచోటి 23.4, చిన్నమండెం 7.8, సంబేపల్లె 12.4, వీరబల్లి 1.8, టి సుండుపల్లి 5.2, లక్కిరెడ్డిపల్లె 6.8, చక్రాయపేట 2.0, రామాపురం 20.0, గాలివీడు 9.0, రాజంపేట 29.4, నందలూరు 2.2, రైల్వేకోడూరు 3.2, ఓబులవారిపల్లె 7.8, పోరుమామిళ్ల 4.2, బి కోడూరు 8.2, బద్వేలు 20.2, గోపవరం 6.8, కలసపాడు 7.0, కాశినాయన 3.2, బి మఠం 8.2, సిద్ధవటం 4.8, ఒంటిమిట్ట 2.0, జమ్మలమడుగు 49.2, మైలవరం 38.0, ముద్దనూరు 4.2, కొండాపురం 5.4, ప్రొద్దుటూరు 19.2, చాపాడు 22.4, దువ్వూరు 28.2, మైదుకూరు 25.2, రాజుపాలెం 40.0, పులివెందుల 3.0, లింగాల 16.4, వేంపల్లె 8.2, వేముల 2.0, తొండూరు 10.6, సింహాద్రిపురం 9.2 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో పదుపాటి వర్షం కురవడంతో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారం కోసం న్యాయ సదస్సు



మాట్లాడుతున్న జడ్జి యాయూయా ప్రసాద్

లీగల్ (కడప అర్బన్) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 19న కోర్టుల్లో జిల్లాలోని అన్ని కోర్టుల మెజిస్ట్రేట్‌లతో సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోకవరపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి యాయూయా ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 2012కు ముందున్న కేసుల్లో ఏవైనా పెండింగ్ ఉంటే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రారంభ సమావేశానికి కలెక్టర్ డాక్టర్ బాబూరావు నాయుడు, ఎస్పీ బాబూజీ అట్టాడ విచ్చేస్తారన్నారు. ఈ సదస్సులో వివిధ శాఖలకు సంబంధించిన కేసుల్లో 2012 కంటే ముందున్న వాటిని వచ్చే మార్చిలోగా పరిష్కరించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు మెజిస్ట్రేట్‌లతో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాను నిర్వహిస్తారన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయాలనీ జడ్జి కోరారు.

వైఎస్‌ఆర్‌ జిల్లా I శనివారం I ఆగస్టు I 19 I 2017
సాక్షి



గండికోటకు వారసత్వ
హోదాపై కదలిక

కడప కల్చరల్‌ :

గండికోటకు యునెస్కో గుర్తింపు ఫైలు మరోమారు కదిలింది. కేంద్ర ఆర్కియాలజీ సర్వే ఆఫ్‌ ఇండియా నిర్దేశకులు డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ మిశ్రా, ఆర్కియాలజీ సర్వే ఆఫ్‌ ఇండియా (రాష్ట్ర) అమరావతి శాఖ సూపరింటెండింగ్‌ ఆర్కియాలజిస్టు డాక్టర్‌ శ్రీలక్ష్మికి ప్రత్యేకంగా ఉత్తరం రాశారు. గండికోటకు యునెస్కో గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర పురావస్తుశాఖ అవసరమైన వివరాలను పంపాలని గుంటూరుకు చెందిన పర్యాటకాభిమాని న్యూఢిల్లీకి చెందిన అఖిలభారత పంచాయతీ పరిషత్‌ జాతీయ కార్యదర్శి, అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్‌ జాస్తి వీరాంజనేయులు అభ్యర్థించారు. స్పందించిన ప్రవీణ్‌కుమార్‌మిశ్రా రాష్ట్రశాఖ అధికారి శ్రీలక్ష్మికి ఉత్తరం రాస్తూ గండికోటకు సంబంధించిన వివరాలను వెంటనే తమకు పంపాలని లేఖ రాశారు.

మళ్లీ కదలిక..

2016 యునెస్కో సూచనల మేరకు ప్రత్యేక ఫార్మెట్‌లో గండికోటకు సంబంధించిన అన్ని అంశాలను సవివరంగా సేకరించి వెంటనే తమకు పంపాలని ప్రవీణ్‌కుమార్‌ మిశ్రా తన లేఖలో కోరారు. యునెస్కో–2017 సూచనల ప్రకారం వివరాలు తనకు అందిన వెంటనే యునెస్కోకు పంపుతామని, వారి పరిశీలనంతరం గండికోటను ప్రపంచ వారసత్వ నిర్మాణంగా గుర్తిస్తూ యునెస్కో ప్రచురించే తాత్కాలిక జాబితాలో చోటు కల్పిస్తామని ఆయన లేఖలో పేర్కొన్నారు.

- నిజానికి 2016 సెప్టెంబరులో గుంటూరుకు చెందిన జాస్తి వీరాంజనేయులు కేంద్ర పురావస్తు శాఖాధికారులను కలిసి రాష్ట్ర శాఖ ద్వారా వివరాలు సేకరించి గండికోటను యునెస్కో తాత్కాలిక జాబితాలో పొందుపరచాలని కోరారు. కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రాష్ట్రశాఖ అధికారులకు ఈ విషయంగా గడువును నిర్దేశించారు. కానీ ఆ గడువులోపుగా రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు గండికోట వివరాలు పంపలేక పోవడంతో మరో రెండు, మూడు నెలలు గడువును పొడిగించారు. అయినా ఫలితం లేకపోవడంతో అక్కడితో ఫైలు ఆగిపోయింది.
- జాస్తి వీరాంజనేయులు మరోమారు ఈ విషయంగా కేంద్ర పురావస్తుశాఖ అధికారులను కలిసి రాష్ట్ర అధికారుల ద్వారా గండికోట వివరాలను తెప్పించుకోవాలని, లేకుంటే ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఉన్న వారసత్వ హోదాకు అన్ని విధాలుగా తగిన అర్హతలున్న గండికోటకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని వరుసగా వినతిపత్రాలు సమర్పించారు. స్పందించిన ఆర్కియాలజీ సర్వే ఆఫ్‌ ఇండియా నిర్దేశకులు ప్రవీణ్‌కుమార్‌మీనా ప్రత్యేకంగా రాష్ట్ర అధికారిణి శ్రీలక్ష్మికి ఉత్తరం రాశారు. గండికోట ప్రపంచ స్థాయి వారసత్వ సంపదకు అర్హమైనదని, ఆ ప్రాంత పర్యాటక సంస్థలు, అభిమానులు చెబుతున్నారని, గండికోట వివరాలను వెంటనే పరిశీలించి సమగ్రమైన నివేదిక పంపాలని కోరారు.

అవిశ్రాంతంగా అధికారులు..

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో గండికోట ఉత్సవాల అనంతరం జిల్లా కలెక్టర్‌, పర్యాటకశాఖ ఆర్డీ, జిల్లా పర్యాటకశాఖాధికారి తామే బాధ్యత తీసుకుని ఓ కన్సెల్టెంట్‌ ద్వారా గండికోట వివరాలను సేకరించి రాష్ట్ర శాఖకు పంపాలని ప్రయత్నించారు. కానీ ఫైలు రాష్ట్ర స్థాయిలో ఆగిపోవడంతో పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అయినా అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

- గండికోటలో పర్యాటకులకు అన్ని రకాల వసతులు, ఆకర్షణలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మూడుసార్లు కోటలో సమావేశాలు ఏర్పాటు చేసి స్థానికుల సహకారం తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా సాహస క్రీడల కోసం సర్వే, ఇతర ఏర్పాట్లు నిర్వహించారు. ఈసారి ఉత్సవాలలోపు గండికోటను అన్ని వసతులు గల పర్యాటక ప్రాంతంగా తీర్చిద్దాలన్న పట్టుదల అధికారుల్లో కనిపిస్తోంది. దీనికితోడు ప్రస్తుతం రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు కేంద్ర శాఖ కోరినట్లుగా గండికోట వివరాలను పంపితే యునెస్కో తాత్కాలిక గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తమవంతుగా పూర్తి సహకారాన్ని అందించాలని పర్యాటకాభిమానులు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్‌డేట్‌ కావాలి..



ఫొటోగ్రఫీ రంగంలో ప్రొఫెషనల్స్‌ ఎప్పటికప్పుడు అప్‌డేట్‌ కావాలి. స్థానిక ఫొటోగ్రాఫర్ల కోసం ఇటీవల పెద్ద నగరాల నుంచి సీనియర్‌ ఫొటోగ్రాఫర్లను రప్పించి ఆధునిక టెక్నాలజీ, ఫొటో మోడలింగ్‌లను పరిచయం చేశాం. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా. - పద్మప్రియ చంద్రారెడ్డి, అధ్యక్షుడు, రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం

ఫొటోలు తీయడం ఒక ప్రత్యేకమైన కళ. ఫొటోలు ఓ జ్ఞాపకాల దొంతర. చిన్నప్పుడు పసితనం వీడనపుడు అయామకంగా ఉండే ముఖాలతో తీయించుకున్న ఫొటోలు పెద్దయ్యాక చూసుకుంటే మనసు ఆరోజుల్లోకి వెళ్లి మైమరిచిపోతాం. పుట్టినరోజు, పాఠశాల వార్షికోత్సవం, పెళ్లిరోజు నుంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనం, రిటైర్‌మెంట్‌ ఫంక్షన్‌ ఇలా బాల్యంనుంచి జీవిత చరమాంకం వరకు ఫొటోలు తీయించుకునే సందర్భం వస్తుంది. సందర్భం ఏదైనా ఫొటోలు మాత్రం జ్ఞాపకాలుగా మిగిలి ఉంటాయి. తీయని గతాన్ని నేటికీ కళ్ల ముందుంచే ఫొటోగ్రఫీ కేవలం హాబీ మాత్రమేకాదు. మంచి వృత్తిగా కూడా చేపడుతున్నారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం. కెమెరా పితామహుడు డాగురేకు పేటెంట్‌ లభించిన రోజును ఫొటోగ్రఫీ దినోత్సవంగా నిర్వహిస్తున్నాం.



చిత్రం.. జ్ఞాపకం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



మన జిల్లాలో...

జిల్లాలో ప్రస్తుతం 250కి పైగా ఫొటో స్టూడియోలు ఉన్నాయి. ఫొటోగ్రఫీ సరంజామా అమ్మే దుకాణాలు 30కి పైగా ఉన్నాయి. కడప నగరం పోతుల డిజిటల్స్‌ స్టూడియోలో అత్యాధునికమైన ఫొటోగ్రఫీ యంత్రాలు ఉన్నాయి. - వాల్‌ పోస్టర్‌ సైజు ఫొటోను ఏమాత్రం రంగు, నాణ్యత చెడకుండా ప్రింట్‌ తీసుకోవచ్చు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై మూడు వేల మందికి పైగా ఆధారపడి జీవిస్తున్నారు.

చరిత్ర ఇదీ!

- ఫొటోగ్రఫీ అనే పదం గ్రీకు భాషకు చెందినది.
- 1826లో ఫ్రెంచ్‌ శాస్త్రవేత్త జోసెఫ్‌ నైసిఫర్‌ సిన్సి తొలి కెమెరాను రూపొందించారు. 1839 ఆగస్టు 19న డాగురె పూర్తి స్థాయి కెమెరాను రూపొందించారు.
- 1850 నుంచి ఫొటోగ్రఫీ కళగా అభివృద్ధి చెందింది.
- 1884లో అమెరికాకు చెందిన జార్జి ఈస్టమన్‌ ఫొటోఫిల్మ్‌ను కనుగొన్నారు. తర్వాత ఆయనే రంగుల ప్రింటింగ్‌ను కనుగొన్నారు.

ఫొటోగ్రాఫర్లు, స్టూడియోలు..

కడప నగరానికి చెందిన ఎన్‌.వెంకటేశ్వర్లు (90) సీనియర్‌ ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు సాధించారు. 1937లో పదేళ్ల వయస్సులో ఫొటోలు తీసి నాటి కలెక్టర్‌ వీఎస్‌ హెజ్‌మాడి అభినందనలు సంపాదించారు. నాటి ఆంగ్ల పత్రికలకు ఫొటోలు అందజేసేవారు. పలువురు రాష్ట్రపతులు, ప్రధానులు జిల్లాకు వచ్చినపుడు ఆయనే ఫొటోలు తీసేవారు. కడప నగరానికి చెందిన రాయల్‌ రషీద్‌ 1950 నుంచి ఫొటోగ్రఫీ రంగంలో ఉన్నారు. రాయల్‌ ఫొటోస్టూడియోను స్థాపించారు. తొలితరం దినపత్రికలకు ఫొటోగ్రాఫర్‌గా, ప్రభుత్వ ఫొటోగ్రాఫర్‌గా పనిచేశారు. నేటికీ ఈ రంగంలో కొనసాగుతున్నారు.

కడప కల్చరల్‌ :

వెయ్యి పేజీల సమాచారాన్ని ఒక్క ఫొటో ద్వారా చెప్పవచ్చని పెద్దలు అంటారు. ప్రచార రంగంలో కూడా ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎన్టీఆర్‌ బస్సు యాత్ర, వైఎస్సార్‌ పాదయాత్రల నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు సాగించిన ప్రస్థానంలో ప్రసార మాధ్యమాల పాత్ర ప్రశంసనీయం. నానాటికి ఫొటోగ్రఫీకి ప్రాధాన్యత పెరుగుతోంది.

- మూడేళ్ల బాలుడు నుంచి కార్పొరేట్‌ ఉద్యోగి వరకు మెడలో ఐడెంటిటీ రూపంలో ఫొటో కార్డులు కనిపిస్తాయి. బ్రిటీషు కాలం నాటి రోలికార్డ్‌ రైస్‌ల్యాండర్‌ రోలిఫ్లెక్స్‌ లాంటి కెమెరాల నుంచి రూ.10 లక్షలు విలువజేసే కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి.
- మొన్నటితరం నాటి క్లిక్‌–3 కాలం నుంచి ఫొటోగ్రఫీ డ్రోన్‌ కెమెరాల స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ఫొటోగ్రఫీలో మొబైల్‌ ఫోన్ల రాక ఈ రంగాన్ని కొత్త మలుపు తిప్పింది. కేవలం ఫొటోల కోసమే ఫోన్లను రూపొందిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.


జిల్లాలో...

- ఒకప్పుడు అరకొరగా ఉండిన ప్రొఫెషనల్‌ ఫొటోగ్రఫీ ఇప్పుడు ఒక వివాహానికి రూ. 4 లక్షలు ఛార్జి చేసే స్థాయికి ఎదిగింది. ప్రొద్దుటూరులో తొలి ఫొటోగ్రాఫర్లు వాసు బ్రదర్స్‌, కడప నగరంలో బాంబే స్టూడియో, దేవి, జెమిని, మూర్తి, జై జవాన్‌–జైకిసాన్‌ స్టూడియోలు ఎంతో పేరు గడించాయి. కడప నగరంలో కృష్ణమూర్తి, నంజుడయ్య తొలి ఫ్రీలాన్స్‌ ఫొటోగ్రాఫర్లుగా పేరు తెచ్చుకున్నారు.

రికార్డు స్థాయి కెమెరాలు..

కడప నగరానికి చెందిన గంగుల యల్లేశ్వరరావు వద్ద దాదాపు 40 రకాల కెమెరాలు ఉన్నాయి. వాటిలో తొలితరం నుంచి నేటి అత్యాధునిక కెమెరాలను కూడా ఆయన సేకరించి ఉంచారు. స్పీడ్‌ గ్రాఫిక్‌ కెమెరానుంచి ఇన్‌ఫ్రారెడ్‌ రిమోట్‌ కెమెరాలు కూడా ఆయన వినియోగిస్తున్నారు. స్వంతంగా వాల్‌పోస్టర్‌ సైజ్‌ ప్రింట్‌ను నాణ్యత చెడకుండా ఎన్‌లార్జ్‌ చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వంతంగా రూపొందించుకున్నారు.

- అటవీ ప్రాంతాల్లో పక్షులు, జంతువుల ఉనికిని ఫొటోలు తీసే రైఫిల్‌ స్టాక్‌ రకం కెమెరా కూడా ఈయన వద్ద ఉంది. కెమెరా బాడీలు, స్టాండ్‌లు, లెన్స్‌లు, రిమోట్లు, ఫిల్మ్‌లు, చిప్‌లు, రీళ్లతో ఆయన ఇల్లు ఓ కెమెరాల మ్యూజియాన్ని తలపిస్తుంది. పలు ప్రభుత్వ కార్యక్రమాలకు యల్లేశ్వరరావు ఫొటోగ్రాఫర్‌గా సేవలందిస్తున్నారు.







శ్రద్ధ చూపితే మంచి ఉపాధి..



ఫొటోగ్రఫీపై శ్రద్ధ చూపితే మంచి ఉపాధిగా మార్చుకోవచ్చు. దీనికి అవసరమైన సరంజామా ఖరీదు కాస్త ఎక్కువే! కానీ తక్కువ ఛార్జీతో నాణ్యతగల ఫొటోలను అందజేస్తే మంచిపేరు లభిస్తుంది. చెప్పిన సమయానికి ఫొటోలు ఇవ్వాలి. క్రమశిక్షణ ముఖ్యం. - పోతుల వెంకట్రామిరెడ్డి, యజమాని, పీవీఆర్‌ డిజిటల్‌ స్టూడియో, కడప

భావాన్ని ఫొటోతో తెలియజెప్పవచ్చు...



వెయ్యి పదాలతో చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటోతో చెప్పొచ్చు. ఒక కెమెరా క్లిక్‌తో సమస్యను కళ్లకు కట్టినట్టు.. సామాన్యులకూ అర్థమయ్యేలా చూపించవచ్చు. గత జ్ఞాపకాలన్నీ ఫొటోలో పదిలంగా ఉంటాయి. అందుకే ఫొటో జీవితంలో ఓ మధుర జ్ఞాపకం. ప్రభుత్వాలు ఫొటోగ్రాఫర్ల సంక్షేమం కోసం మంచి పథకాలు ప్రకటిస్తే బాగుంటుంది. అదే విధంగా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలి.
- గణేష్‌, ఫొటోగ్రాఫర్‌, మంత్ర ఫొటోస్టూడియో, కడప

నిత్య విద్యార్థి కావాలి...



ఫొటోగ్రాఫర్‌ నిత్య విద్యార్థిగా ఈ రంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలి.కెమెరాలు, మిగతా సరంజామా ఖరీదు చాలా ఎక్కువ. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైనపుడు ఆదుకునేందుకు ప్రభుత్వం, సంఘాలు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి. సెల్‌ రాకతో ఫొటోగ్రాఫర్లకు డిమాండ్‌ తగ్గింది. - వి.శ్రీకాంత్‌, శ్రీకాంత్‌స్టూడియో, రాజంపేట



రాయచోటి ఏరియా ఆసుపత్రి జనరల్‌ వార్డులో ఉన్న ఆక్సిజన్‌ సిలిండర్‌



పొద్దుటూరు ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్‌ సిలిండర్లు



రోగులతో రద్దీగా ఉన్న రాయచోటి ఏరియా ఆసుపత్రి

ప్రస్తుతానికి సిలిండర్ల కొరత లేదు..



మా ఆస్పత్రిలో ఇంత వరకూ ఆక్సిజన్‌ కొరత రాలేదు. మాకు ఉన్న 25 సిలిండర్లలో రోజుకు 6–7 సిలిండర్లు ఖాళీ అవుతుంటాయి. వాటి స్థానంలో అదే రోజు ఫుల్‌ సిలిండర్లు నింపుతున్నాం. అత్యవసర సమయంలో అదనంగా సిలిండర్లు కావాల్సి వస్తే పక్కనే ఎర్రగుంట్లలో ఉన్న ప్లాంట్ల నుంచి తెప్పిస్తాం.
- లక్ష్మీప్రసాద్‌, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌.

ఆక్సిజన్‌ తక్కువ రాకుండా చూస్తున్నాం



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో వస్తున్న రోగులకు అనుగుణంగా , తక్కువ రాకుండా ఆక్సిజన్‌ సిలిండర్లు అందుబాటులో ఉంచుతున్నాము. ప్రతి నెలా 4–5 సిలిండర్లు అయిపోతున్నాయి. ఉన్న 9వార్డుల్లో 9 ఆక్సిజన్‌ సిలిండర్లు ఉంచాం. వీటితో పాటు ఆసుపత్రిలో ప్రస్తుతం 2 ఆక్సిజన్‌ మిషన్లు ఉన్నాయి. అదనంగా మరి కొన్ని మిషన్లు కావాలని ప్రతిపాదనలు పంపాం.
- సహదేవయ్య. సూపరింటెండెంట్‌, రాయచోటి ఏరియా ఆసుపత్రి

ముందే మేల్కొందాం...
ప్రాణం కాపాడుదాం

- అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్‌ సిలిండర్లు ఉంచాలి
- అప్రమత్తంగా ఉంటే గోరఖ్‌పూర్‌ ఘటనలకు చెక్‌

రాయచోటి రూరల్‌ : రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మొత్తం 9 వార్డులు ఉండగా, అందులో 9 ఆక్సిజన్‌ సిలిండర్‌ ఉన్నాయి. అలాగే అన్ని వార్డుల్లో ఆక్సిజన్‌ మిషన్లు ఉండాల్సి ఉంది. అయితే కేవలం రెండు మాత్రమే మిషన్లు ఉన్నాయి. మరి కొన్ని ఆక్సిజన్‌ మిషన్లు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

- రాయచోటి ఏరియా ఆసుపత్రిలో జనరల్‌ ఉమెన్‌, మెన్‌ వార్డులతో పాటు నవజాత శిశువులకు సంబంధించి మొత్తం 3 వార్డులు, జనరల్‌ క్యాజువాలిటీ వార్డు –1, ఎమర్జెన్సీ వార్డు, కాన్పుల వార్డు, ఆపరేషన్‌ థియేటర్‌ వార్డులు ఉన్నాయి . వీటిలో ఉండాల్సిన ఆక్సిజన్‌ సిలిండర్లు ఉన్నాయి. అయితే అన్నింటిలో నిరంతరం ఆక్సిజన్‌ సిలిండర్లతో పాటు ఆక్సిజన్‌ మిషన్లు కూడా ఉండాలి. అయితే రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మాత్రం కేవలం రెండు మిషన్లు మాత్రమే ఉండగా, వాటిని ప్రస్తుతం ఎమర్జెన్సీ వార్డు, ఆపరేషన్‌ థియేటర్‌ వార్డులో మాత్రమే ఉపయోగిస్తున్నారు.
- రాయచోటి నియోజకవర్గంలో 7 పీహెచ్‌సీలు ఉండగా, ఎక్కడా కూడా ఆక్సిజన్‌ సిలిండర్లు లేవు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో కచ్చితంగా నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి రావాల్సి వస్తోందని రోగులు అంటున్నారు.

పీహెచ్‌సీల్లో ఆక్సిజన్‌ సిలిండర్లు ఏర్పాటు చేయాలి



మండలాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో కూడా ఆక్సిజన్‌ సిలిండర్లు, మిషన్లు అందుబాటులో ఉంచాలి. అత్యవరసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి తప్పకుండా రాయచోటికి లేదా కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని పీహెచ్‌సీల్లో ఆక్సిజన్‌ సిలిండర్లు అందుబాటులో ఉంచాలి. - అభిషేక్‌, చిన్నమండెం మండలం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి పట్టణంతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున రోగులు వస్తుంటారు. రోజుకు 800 దాకా ఓపీ ఉంటుంది. ఆస్పత్రిలో 25 ఆక్సిజన్‌ సిలిండర్లు ఉన్నాయి. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, క్యాజువాలిటి, రెండు ఆపరేషన్‌ థియేటర్లు, మెడికల్‌ వార్డు, చిన్న పిల్లల విభాగం, ఎస్‌ఎన్‌సీయూ, ప్రసూతి, తదితర విభాగాల్లో ఆక్సిజన్‌ సిలిండర్లు అవసరం అవుతాయి.

- రోజుకు 6–7 సిలిండర్లు చొప్పున నెలకు సుమారు 200 వరకు అవసరం అవుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ లక్ష్మీప్రసాద్‌ తెలిపారు. గతంలో 20 సిలిండర్లు ఉండగా ఇటీవల 5 సిలిండర్లు వచ్చాయని తెలిపారు. ఎర్రగుంట్లలోని వంశీ ఆక్సిజన్‌ ప్లాంట్‌ నుంచి ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి సిలిండర్లను సరఫరా చేస్తారు.

రోజువారి సేవలకైతే ఇబ్బంది లేదు..

ఆస్పత్రిలో రోజు వారి సేవలకైతే ఎలాంటి ఇబ్బంది ఉండదని, అయితే ఒక్కసారిగా అత్యవసర కేసులు ఎక్కువ సంఖ్యలో వస్తే మాత్రం ఇబ్బందికర పరిస్థితి తప్పదని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఆస్పత్రిలో 25 సిలిండర్లు ఉన్నప్పటికీ ఒక్కో విభాగానికి 2,1 మాత్రమే ఉన్నాయి. అత్యవసర విభాగంలో మాత్రం నాలుగు ఉన్నాయి. రోడ్డు ప్రమాద, ఏదైనా అనుకోని విపత్తు జరిగి ఆస్పత్రికి అత్యవసర కేసులు వస్తే మాత్రం ఇతర విభాగాల్లో ఉన్న సిలిండర్ల కోసం పరుగులు తీయాల్సిందే.

అరకొరగా ఆక్సిజన్‌



సీమాంక్‌ ఆపరేషన్‌ థియేటర్‌లో చిన్న సిలిండర్లు

రాజంపేట : పార్లమెంటు నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట ఏరియా ఆసుపత్రిలో ఆక్సిజన్‌ సిలిండర్లు అరకొరగా ఉన్నాయి. పెద్దాసుపత్రి కనీసం 30 సిలెండర్లు అందుబాటులో ఉంటే ఏ క్షణమైనా.. ఎంతమంది రోగులకు అయినా చికిత్స అందించవచ్చు. ప్రస్తుతానికి ఓపీబ్లాక్‌కు సంబంధించి 12 సిలిండర్లు ఉన్నాయి. అయితే ఒక రోగికి రాత్రంతా పెట్టాల్సిన పరిస్థితి వస్తే 15 రోజులకే ఈ సిలెండర్లు సరిపడతాయి.

- కడప–రేణిగుంట నేషనల్‌ హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాప్రాయంలో ఉన్నప్పుడు అవసరమైన పరిస్థితిలో ఆక్సిజన్‌ పెట్టాల్సి వస్తే అప్పుడు వైద్యులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. సగటును 30 సిలిండర్లు అందుబాటులో ఉంటే ఆక్సిజన్‌ అనేది కొరత లేకుండా ఉంటుందనే భావన వైద్యసిబ్బందిలో నెలకొంది.

సీమాంక్‌లో మూడు చిన్నసిలిండర్లు..

సీమాంక్‌ సెంటర్‌లో మూడు చిన్న సిలిండర్లు ఉన్నాయి. ఇందులో ఒకటి ఖాళీ కావడంతో రెండు సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. సీమాంక్‌లో ఆపరేషన్లు రెఫర్‌ లేకుండా ఉంటే ఈ మూడు సిలిండర్లు కూడా శస్త్రచికిత్సలో భాగంగా సరిపోవనేది సమాచారం.

ఆక్సిజన్‌ నింపుకోవాలంటే..

ఏరియా ఆసుపత్రికి ప్రస్తుతం ఉన్న ఆక్సిజన్‌ సిలిండర్లకు ఆక్సిజన్‌ నింపుకోవాలంటే పురిటికష్టాలు అనే కం ఉన్నాయి. ఆక్సిజన్‌ సిలిండర్లను కడపకు తీసుకెళ్లి పట్టించుకునేందుకు, రవాణాకు ఎటువంటి నిధులేవు. కేవలం ఆసుపత్రి అభివృద్ధి క మిటి నిధుల నుంచి వినియోగించుకోవాల్సిన పరిస్థితి.